


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 315, పేజీలు - 08
మంగళవారం, మే 5, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్
ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక
HYDERABAD

# 5 రాష్ట్రాల్లో ప్రజా తీర్పు



**- బెంగాల్ లో కూలిన మమతా కోట - తమిళనాడులో విజయ్ ప్రభంజనం**
**- కేరళలో కాంగ్రెస్ గెలుపు - అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీ జైత్రయాత్ర**

**ASSAM** — Assembly Constituencies 123* /126

| Parties | Leading | Won |
|---|---|---|
| BJP | 0 | 82 |
| INC | 0 | 19 |
| BOPF | 0 | 10 |
| AGP | 0 | 10 |
| AIUDF | 0 | 2 |

**KERALA** — Assembly Constituencies 126* /140

| Parties | Leading | Won |
|---|---|---|
| INC | 0 | 63 |
| CPI(M) | 0 | 26 |
| IUML | 0 | 22 |
| CPI | 0 | 8 |
| KEC | 0 | 7 |

**PUDUCHERRY** — Assembly Constituencies 26* /30

| Parties | Leading | Won |
|---|---|---|
| AINRC | 0 | 12 |
| DMK | 0 | 5 |
| BJP | 0 | 4 |
| IND | 0 | 3 |
| TVK | 0 | 2 |

**TAMIL NADU** — Assembly Constituencies 223* /234

| Parties | Leading | Won |
|---|---|---|
| TVK | 0 | 108 |
| DMK | 0 | 59 |
| ADMK | 0 | 47 |
| INC | 0 | 5 |
| PMK | 0 | 4 |

**WEST BENGAL** — Assembly Constituencies 292* /294

| Parties | Leading | Won |
|---|---|---|
| BJP | 0 | 206 |
| AITC | 0 | 81 |
| INC | 0 | 2 |
| AJUP | 0 | 2 |
| CPI(M) | 0 | 1 |

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు భారత రాజకీయాల్లో కొత్త మార్పులు తెస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిల్లో బీజేపీ తన జైత్రయాత్రను కొనసాగించగా, కేరళలో దశాబ్ద కాలం తర్వాత కాంగ్రెస్ మళ్ళీ పీఠాన్ని దక్కించుకుంది. అయితే, అందరినీ విస్మయానికి గురిచేస్తూ తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభంజనం సృష్టించి, రాష్ట్రాన్ని హంగ్ దిశగా నడిపించింది.

## బెంగాల్‌లో కాషాయ రేఖ - అస్సాంలో హిమంత హ్యాట్రిక్

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ 15 ఏళ్ల పాలనకు బీజేపీ చరమగీతం పాడింది. సువేందు అధికారి నాయకత్వంలో 200 కంటే ఎక్కువ స్థానాల్లో విజయకేతనం ఎగురవేసి, బీజేపీ అక్కడ మొదటిసారి అధికార పీఠాన్ని కైవసం చేసుకుంది. అటు అస్సాంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తన అభివృద్ధి మంత్రంతో వరుసగా మూడోసారి బీజేపీని విజయతీరాలకు చేర్చి హ్యాట్రిక్ నమోదు చేశారు. పుదుచ్చేరిలో కూడా ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ఎన్ఆర్ కాంగ్రెస్-బీజేపీ కూటమి మళ్ళీ అధికారాన్ని నిలబెట్టుకుంది.

## కేరళలో మళ్ళీ చేయి - ఎల్‌డీఎఫ్ పతనం

కేరళలో పినరయి విజయన్ వరుసగా మూడోసారి గెలిచి రికార్డు సృష్టిస్తారన్న అంచనాలను ఓటర్లు తలకిందులు చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 100 కంటే ఎక్కువ స్థానాల్లో ఆధిక్యం సాధించి తిరుగులేని విజయాన్ని అందుకుంది. పదేళ్ల కమ్యూనిస్టు పాలనపై ఉన్న అసంతృప్తి, ముఖ్యంగా ఆర్థిక సంక్షోభం, అవినీతి ఆరోపణలు కాంగ్రెస్‌కు పట్టం కట్టేలా చేశాయి. సతీశన్, చెన్నితల నాయకత్వంలో యూడీఎఫ్ మళ్ళీ కేరళ కోటను హస్తగతం చేసుకుంది.

## తమిళనాడులో విజయ్ విప్లవం - హంగ్ ముంగిట రాష్ట్రం

తమిళనాడు ఫలితాలు ఈ ఎన్నికల్లోనే అత్యంత సంచలనంగా మారాయి. ఎవరూ ఊహించని విధంగా నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం 109 స్థానాల్లో ముందంజలో ఉండి, అతిపెద్ద పార్టీగా అవతరించింది.
ముఖ్యమంత్రి స్టాలిన్ తన కంచుకోట కొలత్తూరులో ఓడిపోవడం డీఎంకే పతనానికి నిదర్శనంగా నిలిచింది. అన్నాడీఎంకే 55 స్థానాలతో, డీఎంకే 52 స్థానాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏ పార్టీకీ 118 మార్కు అందకపోవడంతో, విజయ్ ఇప్పుడు ఇతర పార్టీల మద్దతుపై ఆధారపడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

## ముగిసిన ద్రవిడ యుగం - కొత్త శకానికి నాంది

ఈ ఐదు రాష్ట్రాల తీర్పు భారత రాజకీయాల్లో స్పష్టమైన మార్పును సూచిస్తోంది. వారసత్వ రాజకీయాలను, సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న వారిని ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. బెంగాల్‌లో మమత, కేరళలో విజయన్, తమిళనాడులో స్టాలిన్ వంటి దిగ్గజాలకు ఓటర్లు షాక్ ఇచ్చారు. అభివృద్ధిని, కొత్త ముఖాలను ఆదరిస్తూనే జాతీయ స్థాయిలో బీజేపీ పట్టును, ప్రాంతీయ స్థాయిలో విజయ్ వంటి కొత్త శక్తుల ఎదుగుదలను ఈ ఎన్నికలు ధృవీకరించాయి. రాబోయే కొద్ది రోజుల్లో తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై జరిగే రాజకీయ పరిణామాలు దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించనున్నాయి.

---

# భయం నీడ నుంచి బెంగాల్‌కు విముక్తి

**- ఎన్నికల ఫలితాల్లో బీజేపీ హవాపై కీలక ప్రసంగం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రదర్శించిన అద్భుతమైన పనితీరుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. బెంగాల్‌లో పార్టీకి లభించిన అపూర్వ విజయం వల్ల, ఆ రాష్ట్రాన్ని భారత్‌లో అంతర్భాగంగా ఉంచేందుకు పోరాడిన డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆత్మకు ఎంతో శాంతి చేకూరి ఉంటుందని ఆయన భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. సోమవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విజయోత్సవ సభలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఆయన పంచెకట్టులో రావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

2లో..

# కేసీఆర్‌పై రాజకీయంగానే కవిత విమర్శలు

**- కల్వకుంట్ల ఫ్యామిలీ చీలిపోయినట్లేనా..?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాజకీయాలకు, కుటుంబ బంధాలకు మధ్య కల్వకుంట్ల కవిత స్పష్టమైన గీత గీశారు. తన తండ్రి లేకపోతే తాను లేనని తాను వ్యక్తిగతంగా తాను ఎప్పుడూ విమర్శించబోనని స్పష్టం చేశారు. కేవలం రాజకీయంగా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ను మాత్రమే విమర్శిస్తున్నానని అంటున్నారు. కవిత లెక్క ప్రకారం రాజకీయం వేరు కుటుంబం వేరు. కుటుంబాన్ని రాజకీయంతో ఆమె మిక్స్ చేయలేదు. చేయాలనుకోవడం లేదు.

## రాజకీయం వేరు.. రక్తసంబంధం వేరు

కల్వకుంట్ల కవిత తన రాజకీయ ప్రస్థానంలో కుటుంబ బంధాలకు, సిద్ధాంతాలకు మధ్య ఒక స్పష్టమైన సరిహద్దును గీశారు. నా తండ్రి లేకపోతే నేను లేను వ్యక్తిగతంగా ఆయనపై నాకు అపారమైన గౌరవం ఉంది. కానీ రాజకీయంగా బీఆర్ఎస్ అధ్యక్షుడి నిర్ణయాలను విమర్శించకుండా ఉండలేను అని ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. కుటుంబాన్ని రాజకీయాల్లోకి లాగకూడదన్నది ఆమె ప్రధాన ఉద్దేశం. అయితే, ప్రస్తుత రాజకీయాల్లో వ్యక్తిగతం, రాజకీయం వేరువేరుగా చూడటం

2లో..

# ఇకపై 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

**- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో వాహన రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. వాహనం కొనుగోలు చేసిన చోటే రిజిస్ట్రేషన్ పూర్తిచేసేలా, వాహన డీలర్లనే అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా గుర్తిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం ద్వారా కేవలం 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావాలని, ప్రజలకు ఎలాంటి జాప్యం, ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఈ నిర్ణయంతో వాహనదారులు రిజిస్ట్రేషన్ కోసం రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పనుంది. సోమవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి

2లో..

---

# ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్

**- సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**

- పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ తప్పనిసరి
- రవాణా వ్యయం తగ్గింపు అత్యంత కీలకమని స్పష్టీకరణ
- పరిశ్రమలు, మౌలిక వసతులు, పర్యాటకంపై ప్రత్యేక దృష్టి
- ప్రతి జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ పార్క్.. యువతకు ఉపాధి కల్పన



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యే స్థానిక ఉత్పత్తులను ప్రపంచ స్థాయి బ్రాండ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఉత్పత్తుల నాణ్యతను పెంచడంతో పాటు, వాటికి ప్రపంచ

2లో..

# "అమ్మ" ఫుల్ హ్యాపీ



**- కవితలో ఉత్సాహం నింపిన తమిళనాడు ఎన్నికల ఫలితాలు**
**- విజయ్ పార్టీపై ఆసక్తికర కామెంట్స్!**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** భారత్ రాజకీయాల్లో తమిళనాడు ఎప్పుడూ కొత్త ట్రెండ్ సృష్టిస్తూ వస్తోంది. తాజా ఫలితాల్లో ఇది మరోసారి రుజువు చేసింది. ఇప్పుడు ఈ మార్పు దేశ రాజకీయాలను మార్చబోతోందనే చర్చ మొదలైంది. ఇప్పుడు ఇక్కడ ప్రజలు ఇచ్చిన తీర్పు ఒక రాష్ట్రానికే పరిమితం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. తమిళ ప్రజలు పంపిన ఈ సంకేతం దేశమంతటా ప్రతిధ్వనిస్తుందని అభిప్రాయపడ్డారు. తమిళనాడులో కొత్త రాజకీయ శక్తులు, ముఖ్యంగా నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే సాధిస్తున్న విజయాన్ని పరోక్షంగా కవిత ప్రస్తావించారు. దీనిపై సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని పోస్టు చేశారు. ఆమె మాటల్లో చెప్పాలంటే ఇది కేవలం ఒక ఎన్నికల ఫలితం కాదు, పాత రాజకీయ చరిత్రను తిరగరాయాల్సిన సమయం ఆసన్నమైందని

2లో..

# కేరళలో కాంగ్రెస్ చారిత్రాత్మక విజయం

**- ఎప్పటికీ మరవలేనంటూ సీఎం రేవంత్ ట్వీట్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ కూటమి అభ్యర్థులు 104 స్థానాల్లో ముందంజలో ఉన్నారు. అధికార ఎల్డీఎఫ్ 35 స్థానాల్లో మాత్రమే లీడ్‌లో ఉంది. కేరళలో కాంగ్రెస్ కూటమి సాధించిన చారిత్రాత్మక విజయంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ అఖండ విజయం పట్ల కూటమి నాయకులకు, కార్యకర్తలకు, కాంగ్రెస్ శ్రేణులకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు.
కేరళలో ఈ అద్భుత విజయం సాధించడానికి మార్గనిర్దేశం చేసిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు

2లో..

# ఎన్నికల ఫలితాలు రేవంత్, స్టాలిన్‌లకు చెంపపెట్టు

**- కాంగ్రెస్ ఇక ఎప్పటికీ అధికారంలోకి రాదన్న బండి సంజయ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశ రాజకీయాల్లో విభజన రేఖలు గీసే ప్రయత్నం చేస్తున్న వారికి ప్రస్తుత ఎన్నికల ఫలితాలు సరైన గుణపాఠమని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ ప్రజల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలకు కాలం చెల్లిందని, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్‌లకు ఈ ఫలితాలు ఒక చెంపపెట్టు వంటివని అన్నారు. రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల్లో మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్లు రాబోతున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ఫలితాలపై సంజయ్ స్పందిస్తూ, ఐదు రాష్ట్రాల్లో వెలువడుతున్న ఫలితాలు దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ

2లో..

# భయం నీడ నుంచి బెంగాల్‌కు విముక్తి

### శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆత్మ శాంతించి ఉంటుంది

ప్రధాని మోదీ తన ప్రసంగంలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలను గుర్తు చేసుకున్నారు. "దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు ముఖర్జీ ఒక గొప్ప యుద్ధమే చేశారు. ఈ రోజు బెంగాల్ ఫలితాలతో ఆయన ఆత్మ ఎంతో శాంతించి ఉంటుంది. 1951లో భారతీయ జనసంఘ్ (బీజేపీకి పూర్వ రూపం) స్థాపించి, దేశం కోసం జీవించాలి, దేశం కోసం మరణించాలి అనే సందేశాన్ని ప్రతి కార్యకర్తకు ఇచ్చారు. దేశమే ప్రథమం అనే మంత్రాన్ని అనుసరించేవారు ప్రాణత్యాగానికి కూడా వెనుకాడరని తన జీవితం ద్వారా నిరూపించారు" అని మోదీ కొనియాడారు. బెంగాల్ ప్రజలు దశాబ్దాల భయం నీడ నుంచి విముక్తి పొందేందుకు బీజేపీకి అవకాశమిచ్చారని, వారికి సుపరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు.

### భయం, హింస నుంచి విముక్తి

బెంగాల్ రాజకీయ సంస్కృతిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ అన్నారు. "గతంలో బెంగాల్ ఎన్నికలంటే హింస, భయానక వాతావరణం, అమాయకుల మరణాలు అనే వార్తలు వచ్చేవి. కానీ ఈసారి ప్రశాంతంగా ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ఒక్క ప్రాణం కూడా పోలేదు. ప్రజాస్వామ్య పండుగలో ప్రజల గొంతు వినిపించింది. తొలిసారిగా భయంపై ప్రజాస్వామ్యం గెలిచింది" అని ఆయన పేర్కొన్నారు. ఇకపై బెంగాల్‌లో హింస, ప్రతీకార రాజకీయాలకు స్వస్తి పలికి, శాంతియుత వాతావరణంలో అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్ని పార్టీలకు ఆయన పిలుపునిచ్చారు.

### కాంగ్రెస్ ఒక 'అర్బన్ నక్సల్స్' ముఠా

ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రతిపక్షాలపై, ముఖ్యంగా కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "నారీ శక్తి వందన్ అధినియం"ను వ్యతిరేకించిన కాంగ్రెస్, డీఎంకేలను మహిళా ఓటర్లు శిక్షించారని అన్నారు. "అడవుల్లో అంతరించిపోతున్న మావోయిజం ఇప్పుడు కాంగ్రెస్‌లో పాతుకుపోయింది. ఆ పార్టీ 'అర్బన్ నక్సల్స్' ముఠాలా మారింది. ప్రపంచం తిరస్కరించిన కమ్యూనిజం భావజాలంతో కాంగ్రెస్ చేతులు కలుపుతోంది" అని సంచలన ఆరోపణలు చేశారు. దేశ సంస్కృతి, ఆకాంక్షలను అర్థం చేసుకోలేక కాంగ్రెస్ రోజురోజుకూ కుంచించుకుపోతోందని విమర్శించారు. సమాజ్‌వాదీ పార్టీ కూడా మహిళా వ్యతిరేక విధానాల వల్ల వారి ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

### గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు కమలం

తన ప్రసంగంలో ప్రధాని మోదీ గంగా నదితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు గంగా నది ప్రవహించే అన్ని రాష్ట్రాల్లో (ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్) ఇప్పుడు బీజేపీ–ఎన్డీయే అధికారంలో ఉండటం గర్వకారణమని అన్నారు. 2014లో కాశీలో నామినేషన్ వేసేందుకు వెళ్లినప్పుడు, "నన్ను ఎవరూ పిలవలేదు, నన్ను ఎవరూ పంపలేదు సాక్షాత్తు గంగా మాతే నన్ను పిలిచింది" అని చెప్పిన మాటలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు గంగా మాత ఆశీస్సులు పార్టీపై ఉన్నాయని, అదే అనుభూతి కలుగుతోందని తెలిపారు.

### తూర్పు భారత పునరుజ్జీవంతోనే 'వికసిత్ భారత్'

"వికసిత్ భారత్ ఏ2047" లక్ష్య సాధనలో తూర్పు భారతదేశం పాత్ర అత్యంత కీలకమని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. "పాత రోజుల్లో అప్పటి బీహార్, బెంగాల్, ఒడిశా భారత గొప్పతనానికి మూడు స్తంభాలుగా ఉండేవి. కళింగ (ఒడిశా) సముద్ర వాణిజ్యంలో, అంగ (బీహార్) పత్తి, పట్టు వ్యాపారంలో, బంగ (బెంగాల్) సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లాయి. వికసిత్ భారత్ సాధించాలంటే ఈ మూడు స్తంభాలను పునరుజ్జీవింపజేయాలి. ఈ మూడు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనించేందుకు బీజేపీపై విశ్వాసం ఉంచడం సంతోషంగా ఉంది" అని ఆయన అన్నారు. విజయం సాధించిన ఇతర పార్టీలకు అభినందనలు తెలుపుతూ, కేంద్ర ప్రభుత్వం వారికి పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.

# కేసీఆర్‌పై రాజకీయంగానే కవిత విమర్శలు

అసాధ్యమన్న వాస్తవం ఆమె ఇంటి నుంచే మొదలైనట్లు కనిపిస్తోంది.

### తెగిపోయిన బంధాలు.. కేసీఆర్ మౌనం

కవిత తన రాజకీయ అడుగులను స్వతంత్రంగా వేయడం ప్రారంభించినప్పటి నుండి, కేసీఆర్ కుటుంబంలో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరాయి. తన తండ్రి తనతో మాట్లాడి నెలలు గడుస్తోందని కవిత స్వయంగా అంగీకరించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. గతంలో కవిత లేకుండా కేసీఆర్ ఏ కార్యక్రమం చేసేవారు కాదు, కానీ ఇప్పుడు కుటుంబ వేడుకలకు సైతం ఆమెకు సమాచారం అందడం లేదని తెలుస్తోంది. కేసీఆర్ మౌనం కేవలం రాజకీయ అసమ్మతి మాత్రమే కాదు, అది ఒక తండ్రిగా ఆయనలో ఉన్న అసహనాన్ని , వ్యూహాత్మక దూరాన్ని సూచిస్తోంది.

### కేటీఆర్, కేసీఆర్ పాటించలేకపోతున్న కవిత విధానం

కవిత ప్రతిపాదిస్తున్న రాజకీయం వేరు – వ్యక్తిగతం వేరు అనే సూత్రాన్ని కేసీఆర్ మరియు, కేటీఆర్ పాటించేందుకు సిద్ధంగా లేరు. తెలంగాణ రాజకీయాల్లో దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యం వహించిన వారిద్దరికీ, సొంత కుటుంబ సభ్యురాలే గళం విప్పడం మింగుడుపడటం లేదు. రాజకీయ విమర్శలను వ్యక్తిగత ద్రోహంగా భావించే సంప్రదాయం ఉండటంతో, కవిత తీరును వారు కుటుంబ చీలికగా పరిగణిస్తున్నారు.

ఫలితంగా, కవితను ఒంటరిని చేయడం ద్వారా ఆమెపై ఒత్తిడి పెంచాలని చూస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కుటుంబం దూరం పెట్టినా, కవిత తన రాజకీయ లక్ష్యం నుండి వెనక్కి తగ్గడం లేదు. రాజకీయంగా కేసీఆర్ తప్పులను ఎత్తిచూపుతూనే ఉంటాను ప్రజల పక్షాన నా పోరాటం ఆగేది లేదు అని ఆమె కుండబద్దలు కొట్టారు. తండ్రి ఇమేజ్ నుండి బయటకు వచ్చి, తనకంటూ ఒక సొంత అస్తిత్వాన్ని నిర్మించుకునే క్రమంలో ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఆమె స్థాపించిన తెలంగాణ రక్షణ సేన రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపైనే గురి పెట్టింది.

### భవిష్యత్తులో రాజకీయ ప్రకంపనలు ఖాయమా.?

కల్వకుంట్ల కుటుంబంలో ఏర్పడిన ఈ చీలిక కేవలం ఒక ఇంటి సమస్య కాదు, ఇది తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది. కవితను పూర్తిగా దూరం పెట్టడం వల్ల కేసీఆర్ నష్టపోతారా? లేక కుటుంబ మద్దతు లేకుండా కవిత రాజకీయంగా నిలదొక్కుకోగలరా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏదేమైనా, ఒక కూతురిగా తండ్రిని గౌరవిస్తూనే, ఒక నాయకురాలిగా ఆయన రాజకీయాలను ఎండగట్టడం అనేది భారతీయ రాజకీయాల్లో ఒక అరుదైన , సాహసోపేతమైన ప్రయోగమని అనుకోవచ్చు. కవిత పోరాటం ఇప్పుడు కేవలం ప్రత్యర్థి పార్టీలపై మాత్రమే కాదు, తనను నిరాకరిస్తున్న తన సొంత కుటుంబ వ్యవస్థపై కూడా సాగుతోంది. ఈ వారసత్వ యుద్ధం చివరకు ఎక్కడికి దారితీస్తుందో చూడాలి.

# ఇకపై 24 గంటల్లోనే వాహన రిజిస్ట్రేషన్

సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందాలని, అందుకు అనుగుణంగా అధికారులు వినూత్న ఆలోచనలు చేయాలని దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వ సేవల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని మరింత పెంచాలని సీఎం సూచించారు. ఏఐని సమర్థంగా వాడుకునేందుకు నిపుణులతో ఒక సలహా మండలిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా, రాష్ట్రంలో డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా మైనింగ్ కార్యకలాపాల పర్యవేక్షణకు మధ్యప్రదేశ్ డ్రోన్ వ్యవస్థను ఎలా వినియోగిస్తుందో అధ్యయనం చేసి, ఏపీలోనూ ఆ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తీవ్రమవుతున్న ఎండలు, వడగాల్పుల నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు 'అవేర్' సాంకేతికతను వాడుకోవాలన్నారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వడదెబ్బ తగలకుండా మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా, ప్రతి జిల్లా కలెక్టర్‌కు తక్షణ అవసరాల నిమిత్తం రూ.1 కోటి చొప్పున నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, బోర్ల మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. కార్యదర్శుల స్థాయి అధికారులు నెలలో 3 రోజులు, శాఖాధిపతులు (హెచ్ఓడీలు) 6 రోజులు, జిల్లా కలెక్టర్లు 8 రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలతో మమేకం కావాలన్నారు.ప్రజాభిప్రాయ సేకరణకు కాల్ సెంటర్ ద్వారా వివరాలు సేకరించాలని సూచించారు. అత్యవసర సేవలు మినహా మిగతా అన్ని ప్రభుత్వ సేవలను ఆన్‌లైన్‌లోనే అందించాలని స్పష్టం చేశారు. చేపల వేట నిషేధం ముగిశాక, 'అవేర్' డేటా ఆధారంగా చేపలు సమృద్ధిగా లభించే ప్రాంతాల వివరాలను మత్స్యకారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీ ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్

మార్కెట్ కల్పించేందుకు అవసరమైన పటిష్ఠమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్ల' ఏర్పాటుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఈ క్లస్టర్లు చోదకశక్తులుగా మారాలని ఆకాంక్షించారు.పారిశ్రామిక క్లస్టర్లకు సమగ్రమైన లాజిస్టిక్స్ కనెక్టివిటీని అందించడం అత్యంత కీలకమని సీఎం నొక్కిచెప్పారు. ఉత్పత్తుల తయారీ కేంద్రాలకు రోడ్డు, రైలు, పోర్టు మార్గాలను అనుసంధానం చేయడం ద్వారా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రవాణా వ్యయం తగ్గితేనే ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్‌లో పోటీతత్వం పెరుగుతుందని, అంతిమంగా పరిశ్రమలకు, రాష్ట్రానికి ప్రయోజనం చేకూరుతుందని ఆయన వివరించారు. ఈ క్లస్టర్లకు నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచించారు.సమీక్షలో భాగంగా విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వ 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) పథకం కింద చేపట్టనున్న పారిశ్రామిక, కెమికల్ పార్కుల అభివృద్ధిపై సీఎం అధికారులతో చర్చించారు. 2026–27 నాటికి ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్, ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌తో పాటు 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై ప్రణాళికలను పరిశీలించారు.పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు గ్రామీణ ప్రాంతాలకు, రైతులకు కూడా అందాలని సీఎం ఆకాంక్షించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను భాగస్వామ్యం చేయడం ద్వారా రైతులు పండించిన పంటలకు మంచి ధర లభించేలా చూడాలన్నారు. 'పరిశ్రమలు–మౌలిక సదుపాయాలు–పర్యాటకం' అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగాలని నిర్దేశించారు. ప్రతి జిల్లాలో ఒక మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అనుబంధంగా ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని చంద్రబాబు సూచించారు. 'వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించి, ఏపీని అగ్రస్థానంలో నిలపాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాభివృద్ధి జరగాలని, ఇందుకోసం యూనివర్సిటీల్లో హైబ్రీడ్ విధానంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టే ఆలోచన చేయాలని అన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# "అమ్మ" ఫుల్ హ్యాపీ

అన్నారు. భ్రష్టు పట్టిపోయిన ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలని, కొత్త తరం నాయకత్వం, విభిన్నమైన రాజకీయ ఆలోచనలు ప్రజల ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.ప్రజలు పాత పద్ధతులతో ఎందుకు విసిగిపోయారని కవిత అన్నారు. కేవలం అధికారమే పరమావధిగా పని చేసే నాయకుల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని అన్నారు. వారిపై ఉన్న అసహనం కారణంగానే ప్రజలు ప్రత్యామ్నాయ శక్తులవైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. వ్యవస్థలో పేరుకుపోయిన లోపాలను సరిదిద్దాలంటే కొత్త రాజకీయ శక్తులు రావాడం అనివార్యమని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో తనదైన ముద్ర రాజకీయ ముద్ర వేయాలని చూస్తున్న కవితకు తమిళనాడు ఎన్నికల ఫలితం ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నాయి. అందుకే రాజకీయ చరిత్రను తిరగరాయాల్సిన సమయం వచ్చిందని ఆమె చేసిన కామెంట్స్ టీఆర్ఎస్ ఆలోచనను స్పష్టం చేస్తున్నాయి. కొత్తగా పార్టీ పెట్టిన తను కొత్త ఆలోచనలతో వస్తున్నానని ప్రజలకు మంచి చేసే తమలాంటి వారిని ప్రజలు ఆదరించాలని చెబుతున్నారు.బీఆర్ఎస్‌తో విభేదించిన కవిత గత నెలలోనే టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీ పెట్టారు. ఐదు ముఖ్యమైన లక్ష్యాలతో పార్టీ పెట్టినట్టు వెల్లడించారు. వాటి కోసం తాను పోరాడతానని చెప్పుకొచ్చారు. ఇప్పుడు తమిళనాడులో కూడా పార్టీ పెట్టిన రెండేళ్లలోనే ప్రజలకు చేరువైన టీవీకే మాదిరిగానే తాను కూడా ప్రజలు చేరువ అయ్యేందుకు కవిత ప్రయత్నిస్తున్నారు. అందుకే కొత్త తరం ఆలోచనలతో వస్తున్న తమ లాంటి వారికి ప్రజలు ఛాన్స్ ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇదే విషయాన్ని తన సోషల్ మీడియా పోస్టు ద్వారా చెప్పుకొచ్చారు.

# కేరళలో కాంగ్రెస్ చారిత్రాత్మక విజయం

మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, దీపా దాస్ మున్షీలకు రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వారి సమర్థవంతమైన నాయకత్వం వల్లే ఈ చారిత్రాత్మక గెలుపు సాధ్యమైందని ఆయన కొనియాడారు. కేరళలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ద్వారా దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొందని పేర్కొన్నారు.కేరళలో సీఎం రేవంత్ రెడ్డి స్టార్ క్యాంపెయినర్‌గా పలు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా తన ప్రచార పర్యటనను గుర్తు చేసుకుంటూ రేవంత్ రెడ్డి కేరళ ప్రజలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. 'నేను కేరళలో ప్రచారం చేస్తున్న సమయంలో అక్కడి ప్రజలు నాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలను ఎప్పటికీ మరువలేను. యూడీఎఫ్ మద్దతుదారులకు, కేరళ ప్రజలకు తెలంగాణ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని ఆయన పేర్కొన్నారు. కేరళ ఓటర్లు అభివృద్ధిని, ప్రజాస్వామ్య విలువలను నమ్మి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలు పురోగతి విలువలు, ప్రజాస్వామ్య సిద్ధాంతాలు కలిగిన గొప్ప రాష్ట్రాలని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత దశాబ్ద కాలంగా నిరాశ, నమ్మకద్రోహానికి గురైన కేరళ ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉజ్వల భవిష్యత్తును పొందబోతున్నారని అన్నారు. తెలంగాణలో ఇప్పటికే ప్రజా ప్రభుత్వం కొనసాగుతుండగా ఇప్పుడు కేరళలో కూడా కాంగ్రెస్ అధికారం చేపట్టడం ద్వారా రెండు రాష్ట్రాలు అభివృద్ధిలో కలిసి నడుస్తాయని ఆయన స్పష్టం చేశారు.

## ఎన్నికల ఫలితాలు రేవంత్, స్టాలిన్‌లకు చెంపపెట్టు

భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశాయని అభిప్రాయపడ్డారు. ఆ పార్టీ ఇక ఎప్పటికీ అధికారంలోకి రాదని వ్యాఖ్యానించారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని పూర్తిగా తిరస్కరించినట్లు చెప్పారు. దేశ రాజకీయ ముఖ చిత్రం నుంచి ఆ పార్టీ కనుమరుగవుతోందని ఎద్దేవా చేశారు. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన వంటి చారిత్రాత్మక బిల్లులను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందని, అందుకే కాంగ్రెస్ కూటమి పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలు క్షమించరని ఆయన అన్నారు. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీని పరిపూర్ణ నాయకుడిగా వారి పార్టీ వారే గుర్తించడం లేదని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ కారణంగా కాంగ్రెస్ పాతాళానికి పడిపోవడం ఖాయమని అన్నారు.

## ఘనంగా శక్తి సాయి నగర్‌లో బీజేపీ విజయోత్సవాలు



**నాచారం(ప్రశ్న న్యూస్)** శక్తి సాయి నగర్ డివిజన్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) విజయోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పశ్చిమ బెంగాల్, అస్సాం మరియు పుదుచ్చేరి రాష్ట్రాల్లో పార్టీ సాధించిన విజయాల నేపథ్యంలో ఈ వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఆధ్వర్యం వహించగా, సీనియర్ నాయకులు డివిజన్ మహిళా అధ్యక్షురాలు సబితా యాదవ్, డివిజన్ సెక్రెటరీ పుణ్యవతి, రజియా బేగం, రజిత రెడ్డి బూత్ అధ్యక్షులు లింగం గౌడ్ ఎం నరేష్ ఆనంద్ తదితరులు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు పటాకులు కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజలు బీజేపీపై ఉంచిన విశ్వాసానికి ఈ విజయాలు ప్రతీకగా నిలిచాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు అవినీతి రహిత పరిపాలన పట్ల ప్రజలు చూపిన నమ్మకంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. అదేవిధంగా రాబోయే 2029 ఎన్నికల్లో తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన సీనియర్, యువ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని విజయోత్సవాలను మరింత ఉత్సాహంగా నిర్వహించారు.

# తెలంగాణలో బీజేపీ అధికారం ఖాయం: గాడిపల్లి భాస్కర్ ధీమా



**గజ్వేల్(ప్రశ్న న్యూస్)** తెలంగాణలో రాబోయే 2028–29 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం గజ్వేల్‌లో మాట్లాడిన ఆయన, ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా వచ్చినట్లు పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నందునే ఆ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన తెలిపారు. ఇదే విధంగా తెలంగాణలో కూడా కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామస్థాయిలో ప్రజలకు అందుతున్నాయని అన్నారు. ఆ ప్రభావం రాబోయే ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు.రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పరిపాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొన్నదని, కేవలం 27 నెలల వ్యవధిలోనే ప్రజలు విసుగు చెందారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.తెలంగాణలో బీజేపీ నాయకత్వంలో ముందుకు సాగుతూ ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి రావడం ఖాయమని గాడిపల్లి భాస్కర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

### అనంతసాగర్‌లో ఘనంగా

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని అనంతసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దండు రవీందర్, సర్పంచ్ క్యాసారం కుమార్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మాసంపల్లి గణేష్, మాజీ సర్పంచ్ లావణ్య మల్లేశం, ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు గ్రామ సెక్రెటరీ విక్రమ్ తదితరులు హాజరై గృహప్రవేశాన్ని శు భాకాంక్షలతో నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం చేయాలని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హులకూ చేరేలా కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు.

# బయ్యారం గ్రామంలో సమస్యల మయం

**- చర్యలు తీసుకోవాలంటూ ఎంపీడీవోకు గ్రామస్థుల వినతి**



**గజ్వేల్, (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని బయ్యారం గ్రామంలో పలు సమస్యలు తీవ్రంగా నెలకొన్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన పంగ మోహన్ బాబు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కు పిర్యాదు చేశారు.గ్రామంలో పంచాయితీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలకు అవసరమైన సేవలు అందడం లేదని తెలిపారు. దోమల నివారణ చర్యలు సరైన విధంగా చేపట్టకపోవడం వల్ల ప్రజలు వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.వీధి లైట్లు ఉన్నప్పటికీ సరైన విధంగా ఏర్పాటు చేయకపోవడం వల్ల గ్రామంలో చాలా ప్రాంతాలు చీకట్లో మగ్గుతున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామ పరిశుభ్రత పూర్తిగా దిగజారిపోయిందని, చెత్త సేకరణ, కాలువల శుభ్రత, బ్లీచింగ్ కార్యక్రమాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు.గృహలక్ష్మి పథకం కింద నిర్మించిన ఇళ్లకు బిల్లులు విడుదల చేయకపోవడం, రాజకీయ భేదాభిప్రాయాల ఆధారంగా వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో కూడా అవకతవకలు జరుగుతున్నాయని, పనిదినాలకు తగ్గ వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు.హరితహారం కింద పెంచిన మొక్కలను నరికివేయడం, పల్లె ప్రకృతి వనాలను ధ్వంసం చేయడం జరుగుతోందని, పర్యావరణానికి నష్టం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామ పాలనలో పారదర్శకత లేకపోవడం, వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా నిర్ణయాలు తీసుకోవడం, చెరువు మట్టి అక్రమంగా అమ్మడం, సర్పంచ్ కుటుంబ ఆధిపత్యం పెరగడం వంటి అంశాలను కూడా ప్రస్తావించారు.అదనంగా, తాగునీటి సమస్యలు, మిషన్ భగీరథ ట్యాంక్ పరిశుభ్రత లోపం, జనన––మరణ ధృవపత్రాల ఆలస్యం, రైతు సమస్యలు, రహదారి పనులు నిలిచిపోవడం వంటి అనేక సమస్యలు గ్రామంలో ఉన్నాయని తెలిపారు.ఇన్ని సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ఎంపీడీవో గ్రామాన్ని సందర్శించి తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ప్రజాపాలన .....ప్రగతి ప్రణాళిక

**కుత్బుల్లాపూర్** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం సందర్భంగా, కొంపల్లి లోని కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో సీఈఓ కాంతమ్మ అధ్యక్షతన నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన ,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నేరుగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, మైనారిటీ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రత్యేకంగా మైనారిటీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని, మైనారిటీ యువతకు ఉచిత స్కూటీలు, మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు అందించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ స్వావలంబన దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు. ఈ పథకాలు మైనారిటీ కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు మైనారిటీ మహిళలకు సుమారు 400 ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కుట్టుమిషన్లు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వారి కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.అలాగే ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజా పాలన యొక్క ముఖ్య ఉద్దేశమని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేయాలన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను

# ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్డీఓ కార్యాలయం నిర్మల్, సబ్ కలెక్టర్ కార్యాలయం భైంసాలో డివిజన్ వారీగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గణనలో భాగంగా నిర్వహిస్తున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అధికారులు తప్పనిసరిగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరు - మన జెండా' కార్యక్రమంలో భాగంగా మండలంలో బిజెపి జెండా ఆవిష్కరణ




**నందవరం** మండలం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన 'మన ఊరు - మన జెండా' కార్యక్రమం ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ , జిల్లా అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్ ఆధ్వర్యంలో మండలంలో అత్యంత ఉత్సాహంగా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు అక్కమ్మ తోట రామక్రిష్ణ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు.నందవరం కేంద్రంలో పార్టీ జెండాను జిల్లా నాయకులు ఎగురవేశారు.కార్యకర్తలు భారత్ మాతా కీ జై,నరేంద్ర మోదీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ చేసిన నినాదాలతో గ్రామం హోరెత్తింది. జెండా ఆవిష్కరణ అనంతరం నాయకులు స్థానిక ప్రజలతో మాట్లాడి, గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్నాయా లేదా అన్న విషయంపై ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి.రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేస్తాం.గురజాల గ్రామం నుంచి స్వచ్ఛందంగా బిజెపి పార్టీలోకి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షులు ఈ కార్యక్రమంలోరాష్ట్ర బిల్డింగ్ కమిటి చైర్మన్ విట్టా రమేశ్ అయ్య బిజెపి రాష్ట్ర నాయకురాలు గీతా మాధురి జిల్లా మహిళా మోర్చ అద్యక్షులు సుజాత కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ఎన్ ఈరన్న,జిల్ల కార్యదర్శి మాలతి ఎమ్మిగనూరు పట్టణ అద్యక్షులు దయసాగర్ ఎమ్మిగనూరు పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సురేంద్ర జిల్లా మహిలా మోర్చ ఉపాధ్యక్షులు పద్మవతి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు బి ఎల్ నారాయణ ఎమ్మిగనూరు మండల ఉపాధ్యక్షులు కురువ బడేసాబ్ జిల్ల లీగల్ సెల్ ఉపాధ్యక్షులు వడ్డె ఉరుకుందు మరియు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మారెళ్ళ గ్రామంలో లోపించిన పారిశుద్ధ్య పనులు

**- డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న రహదారి. - మందు బాబులకు అడ్డాగా మారిన సంపద సృష్టి కేంద్రాలు.**

**- గ్రామ సమస్యలను పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి**





**తుగ్గలి:**తుగ్గలి మండల పరిధిలోని మారెళ్ల గ్రామంలో పారిశుద్ధ్య పనులు లోపించినట్లు గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న తారు రోడ్డుకు ఇరువైపులా చెత్తను వేయడంతో రహదారి డంపింగ్ యార్డ్ లా మారిందని పలువురు ప్రజలు తెలియజేస్తున్నారు.ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామ సచివాలయం పంచాయతీ కార్యదర్శికు గ్రామ ప్రజలు ఎన్నిసార్లు చెప్పినప్పటికి అదిగో చేస్తాం ఇదిగో చేస్తాం అనడం తప్ప ఏనాడు ఆ పరిసర ప్రాంతాలను శు భ్రపరచలేదని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి వ్యవహరిస్తున్న తీరుపై గ్రామ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా పేరుకు పోయిన చెత్తను జెసిబి ద్వారా ట్రాక్టర్ల సాహాయంతో నైనా తీయించి రోడ్డును పరిశుభ్రంగా చేయించాలని,అదేవిధంగా గ్రామంలోని సచివాలయం సిబ్బంది కూడా సమయానికి సచివాలయానికి రావడం లేదని గ్రామ ప్రజలు తెలియజేశారు. సంపద సృష్టి కేంద్రాలు మందు బాబులకు అడ్డాగా మారిపోయాయి. మారెళ్ల గ్రామంలో మూడు రోడ్ల కూడలిలో త్రాగునీరు ట్యాంకు నుండి వృధాగా వెళుతుందని,ఉదయం 9 గంటల నుండి సాయంకాలం 3 గంటల వరకు త్రాగునీరు వృధా అవుతున్న పట్టించుకునే నాధుడే లేడని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. మూడు రోడ్ల కూడలిలో నీరు నిల్వచేరి దోమల పెరిగి ప్రజలకు అంటువ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు.త్రాగునీటి సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినా కూడా ఆయన వైపు నుండి ఎటువంటి చర్యలు లేవని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి గ్రామ సమస్యలను పరిష్కారం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి

**- ములుగు డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ**

**- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జీ**



**ములుగు,మే4** ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదుదారులు అందించిన అర్జీలను సత్వరమే వేగంగా పరిష్కరించాలని,రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ములుగు జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్.జి తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్.జి,డివిజనల్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేష్ ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 55 దరఖాస్తులు రాగా వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 12,పెన్షన్ లకు10,ఇతర శాఖలకు సంబంధించినవి 10,డివిజనల్ స్థాయి లో భూ సమస్యలకు సంబంధించి 23దరఖాస్తులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల అర్జీలను నేరుగా అదనపు కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును వ్యక్తిగతంగా పరిశీలించి సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేయడం జరిగిందని తెలిపారు.డివిజన్ స్థాయిలో అందిన భూ సమస్యల దరఖాస్తులను వెంటనే సంబంధిత మండల తాహశీల్దార్ లకు ఆన్లైన్ లో ఫార్వర్డ్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు.ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి వెంటనే కంప్యూటర్ ఆధారిత రశీదు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలపై దరఖాస్తులు అందించినవారు తమ సమస్య స్థితిగతులను కంప్యూటర్ రసీదు ద్వారా పరిశీలించుకోవచ్చు అని సూచించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని,నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఇరిగేషన్ శాఖ ఈఈ సతీష్ చంద్ర ఆత్మహత్య



**నల్గోండ** నల్లగొండ జిల్లా ఇరిగేషన్ శాఖలో విషాదం నెలకొంది. ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సతీష్ చంద్ర ఆత్మహత్య చేసుకున్నారు. సాగునీటి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు పరిధిలోని చందనపల్లి ఆ37 కాలువ లో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. సతీష్ చంద్ర మృతిపై అనుమానాలు వున్నాయని కుటుంబ సభ్యుల అరోపణ. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నూతన దేవాలయాల నిర్మాణాలకు

# సంపూర్ణ సహకారం

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**- పటాన్ చెరు లో కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**పటాన్ చెరు** ప్రజలలో భక్తి భావం పెంపొందించడంలో భాగంగా నియోజకవర్గం వ్యాప్తంగా నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని పంచముఖి హనుమాన్ దేవాలయం ఎదురుగా నూతనంగా నిర్మించ తలపెట్టిన కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. పటాన్చెరు నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులతో 220 కి పైగా దేవాలయాలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు, పాల్గొన్నారు.

## ఇండ్ల స్థలాల కోసం పాత్రికేయులు

# సొసైటీ ఏర్పాటు చేసుకోవాలి

**- అదనపు కలెక్టర్ మహేందర్ జి.**

**- అర్హులైన విలేకరులకు అక్రిడేషన్లు, ఇండ్లు నిర్మించి ఇవ్వాలి**

**- జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ**



**ములుగు** ములుగు జిల్లాలోని పాత్రికేయులు ఇండ్ల స్థలాలను పొందడానికి జిల్లాలో హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జి. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ జి మాట్లాడుతూ జిల్లాలో హౌసింగ్ సొసైటీ లేని కారణంగానే ఇండ్ల స్థలాలను కేటాయించడం జరుగలేదని, స్థల పరిశీలన చేసి అర్హులకు ఇండ్ల స్థలాలు కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జె.జాక్ కన్వీనర్ గుర్రపు శ్రీధర్ మాట్లాడుతూ అర్హులైన విలేకరులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. జిల్లా కేంద్రంలో 2024 సంవత్సరంలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేయగా నేటి వరకు భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని, ఇప్పటికైనా భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు జినుకల ప్రభాకర్, కో- కన్వీనర్లు పోలోజు రామ్మూర్తి, ఎనగందుల కొమురయ్య, మాట్ల సంపత్, సంగ రంజిత్, చల్లగురుగుల రాజు, లకుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎఐఎంఎస్ఆర్‌లో అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ శిక్షణ

**- సమయోచిత నిర్ణయమే ప్రాణ రక్షణకు కీలకం**

**- డీన్ డా.ల్లైడ్ జె అగస్టీన్**



**చిత్తూరు, మే 4:** అత్యవసర వైద్య పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే నైపుణ్యాల పెంపు లక్ష్యంగా అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఏఐఎంఎస్ఆర్)లో రెండు రోజుల బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్), అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ (ఏసీఎల్ఎస్) శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రమాణాలతో నిర్వహిస్తున్న ఈ వర్క్‌షాప్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ రెండు రోజుల శిక్షణా కార్యక్రమం అపోలో నాలెడ్జ్ సిటీలోని డా. పీసీఆర్‌కేసీ ఆడిటోరియంలో జరుగుతోంది. అపోలో హాస్పిటల్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏహెచ్ఈఆర్ఎఫ్), అపోలో సిమ్యులేషన్ సెంటర్ (ఏఎస్‌సీ) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఇందులో పాల్గొంటున్న వైద్య విద్యార్థులకు అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన విధానాలపై నిపుణులు సవివరంగా శిక్షణ అందిస్తున్నారు.ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఏఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ల్లైడ్ జె అగస్టీన్ మాట్లాడుతూ, వైద్య విద్యార్థుల్లో ప్రాణరక్షణ నైపుణ్యాల పెంపుకు ఇటువంటి వర్క్‌షాప్‌లు ఎంతో దోహదపడతాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సమయోచిత నిర్ణయాలు రోగి ప్రాణాలను కాపాడగలవని, బీఎల్ఎస్, ఏసీఎల్ఎస్ శిక్షణ ప్రతి వైద్య విద్యార్థికి అవసరమని చెప్పారు. 'రోగి ప్రాణాపాయ పరిస్థితుల నుంచే నేర్చుకునే విధానం' ద్వారా ప్రాక్టికల్ శిక్షణ పొందిన విద్యార్థుల్లో తక్షణ స్పందన, నిర్ణయ సామర్థ్యాలు మెరుగుపడతాయని ఆయన వివరించారు. సిమ్యులేషన్ ఆధారిత శిక్షణతో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే నైపుణ్యం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అకడమిక్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్ మాట్లాడుతూ, ఈ శిక్షణా కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి 13 మంది అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం అపోలో సిమ్యులేషన్ సెంటర్‌కు చెందిన డాక్టర్ తిలక ముత్తయ్య నాయకత్వంలో జరుగుతోందన్నారు. ఇటువంటి వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థులు కీలక నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు, రోగులకు సమయానుకూలంగా సమర్థవంతమైన సేవలు అందించే నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటారని ఆమె పేర్కొన్నారు.ఈ శిక్షణలో భాగంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ప్రాథమిక జీవన రక్షణ (బీఎల్ఎస్), అడ్వాన్స్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ (ఏసీఎల్ఎస్)పై ప్రాక్టికల్‌తో పాటు థియరీ శిక్షణ అందిస్తున్నారు. గుండెపోటు, శ్వాస ఆగడం వంటి అత్యవసర పరిస్థితులను తక్షణమే గుర్తించి సమయానికి సరైన చికిత్స అందించే విధానాలపై నిపుణుల మార్గదర్శకత్వంలో శిక్షణ ఇస్తున్నారు. ఆధునిక సిమ్యులేషన్ సాంకేతికతతో వాస్తవ పరిస్థితులను అనుకరించి శిక్షణ ఇవ్వడం ఈ కోర్సు ప్రత్యేకతగా నిలుస్తోంది.

# తెలంగాణలో భూముల ధరల పెంపు

**- సీబీఐకు విద్యుత్ కొనుగోలు అక్రమాల కేసు - తెలంగాణ కేబినెట్ నిర్ణయాలు**






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రమంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పలు కీలకమైన ప్రాజెక్టులలో అవినీతిపై సీబీఐ విచారణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విద్యుత్ కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులలో జరిగిన అక్రమాలపై విచారణకు సంబంధించిన కమిషన్ నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)కు అప్పగించేందుకు రాష్ట్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్తు కొనుగోళ్లతో పాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 2024 మార్చి 14వ తేదీన కమిషన్స్ ఆఫ్ ఇన్క్వైరీ చట్టం ప్రకారం రిటైర్డ్ జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు 2024 జులైలో ఆయన విచారణ నుంచి తప్పుకోవటంతో జస్టిస్ మదన్ బి. లోకూర్‌ను కమిషన్‌గా నియమించారు. 2024 అక్టోబర్లో కమిషన్ మొత్తం 114 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అనంతరం 2025 జనవరి 4వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నివేదికపై తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయించింది. నివేదికను పరిశీలించిన అడ్వకేట్ జనరల్ తన సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు. వాటన్నింటినీ ఈ రోజు కేబినెట్ చర్చించింది. ప్రధానంగా అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఈ కేసులో ఉన్నాయి. అందుకే నిష్పాక్షిక దర్యాప్తు జరిపేందుకు సీబీఐ విచారణ అప్పగించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

### - భూముల ధరలను క్రమబద్ధీకరించాలి

మరోవైపు రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మార్కెట్ విలువల రేషనలైజేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి ఇవ్వడం జరిగింది. ఈనెల చివరి వారంలో సవరించిన విలువలు అమల్లోకి వస్తాయి. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఇప్పుడు ప్రభుత్వం చెల్లించే పరిహారం రేట్లపై అసంతృప్తితో ఉన్నారు. ధర పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందిస్తున్నారు. దీంతో పాటు వాస్తవంగా మార్కెట్ లో ఉన్న ధరలతో పోలిస్తే ప్రభుత్వం నిర్ణయించిన భూముల ధరలు భారీగా వ్యత్యాసమున్నాయి. అందుకు శాస్త్రీయ పద్ధతి అనుసరించి ఈ ధరలను సవరించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ?జిల్లాల్లో ఉండే మార్కెట్ విలువల రివిజన్ కమిటీలు అన్ని విషయాలను దృష్టిలో పెట్టుకుని విలువలను సవరిస్తుంది. ?

### - పంట నష్టంపై అంచనాలు ఇవ్వండి

ఇంకోవైపు హిల్ట్ పాలసీలో దరఖాస్తు చేసుకునే వారికి కూడా ఒక అవకాశం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. భూముల ధరలు పెరిగేలోపు దరఖాస్తు చేసుకున్న వారికి ముందుగా పది శాతం చెల్లించే వెసులుబాటు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. వారికి ఇప్పుడున్న భూముల ధరలే వర్తిస్తాయి. మిగతా 90 శాతం 90 రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది. అలాగే అకాల వర్షాలతో వివిధ జిల్లాల్లో పంటలు, పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లినట్లు సమాచారం అందింది. వెంటనే ఆయా జిల్లాల ఇంచార్జి మంత్రులు బాధ్యత తీసుకుని వివరాలు తెప్పించుకుని రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### - నేషనల్ డెయిరీ డవలప్మెంట్ బోర్డుకు నల్గొండ -రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం

నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డుకు అప్పగించే ఎంవోయూకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో నల్గొండ- రంగారెడ్డి మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ కు సంబంధించిన పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి డైరీ ప్లాంట్ నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ఎన్డీడీబీ నిర్వహిస్తుంది. తెలంగాణలో 9 జిల్లాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. పైలెట్ పద్ధతిన 18 చోట్ల ఈ సోలార్ జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దాదాపు రూ. 66.50 కోట్లతో 19 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది.

### - క్యూర్ పరిధిలో పన్నులు క్లియర్ చేసుకునేందుకు ఛాన్స్

క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్లలో పెండింగ్‌లో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పన్నులను క్లియర్ చేరుకునేందుకు వన్ టైమ్ సెటిల్ మెంట్ వెసులుబాటు కల్పించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 5864 కోట్ల బకాయిలున్నాయి. జరిమానాలు, వడ్డీలన్నీ మినహాయించి వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా రూ. 1686 కోట్లు వస్తాయని అంచనా వేసింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలోనే వన్ టైమ్ సెటిల్మెంట్ పై ఈ బకాయిలు వసూలు చేసుకోవాలని మున్సిపల్ శాఖను ఆదేశించింది. హైదరాబాద్ జల మండలికి ఇవ్వాల్సిన నీటి బకాయిలను కూడా సర్దుబాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.

### - బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

ఖమ్మం జిల్లా కామేపల్లి వద్ద బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు నీరు అందించనున్నారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలు (అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్లు), పాలిటెక్నిక్లు, టీ శాట్‌ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువచ్చి, ఒకే గొడుగు కింద ఉంచాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్ నగర్లో ఆధునిక కూరగాయల మార్కెట్ కోసం 42 ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం తెలిపింది.

## మహిళా సంఘ భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ



**జగిత్యాల:**జగిత్యాల రూరల్ మండలం తిప్పన్నపేట గ్రామంలో 10 లక్షలతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, భూమి పూజ చేశారు అనంతరం గ్రామానికి చెందిన పోతు మానస సాగర్ ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై చీర కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కృషి చేస్తుందని అన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను అందిస్తూ, వివిధ రంగాల్లో మహిళా భాగస్వామ్యం కల్పిస్తూ,ప్రోత్సహిస్తూ మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందని అన్నారు.జగిత్యాల జిల్లా లో ఐదు కోట్లతో ఇందిరా మహిళా శక్తి భవనాన్ని నిర్మిస్తున్నామని అన్నారు. ముఖ్య మంత్రి యువతకు ఉపాధి అవకాశాలు కల్పన కోసం అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ ను 6 కోట్లతో జగిత్యాల లో నిర్మించడం జరిగిందని వెల్లడించారు.యువత ఉపాధి కోసం వృత్తి విద్యారంగాల్లో అవకాశాలు ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.జగిత్యాల మహిళ డిగ్రీ కళాశాల అటానమస్ అయిందని, మహిళల కు నూతన వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దావా తిరుపతి, ఉప సర్పంచ్ స్వతంత్ర మహేశ్, మాజీ ఎంపీపీ ములసపు లక్ష్మి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లింగమంతుల స్వామి జాతర మహోత్సవం



**నకిరేకల్** నకిరేకల్ మండలం నెలిబండ గ్రామంలో శ్రీ శ్రీ లింగమంతుల స్వామి జాతర మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నకిరేకల్ శాసనసభ సభ్యుడు, ప్రభుత్వ విప్ శ్రీ వేముల వీరేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులతో కలిసి జాతర ఉత్సవాల్లో పాల్గొని, భక్తులకు దేవుని పట్ల భక్తిభావం ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. జాతర మహోత్సవాలు మన గ్రామీణ సంప్రదాయాలకు ప్రతీక. ఇలాంటి ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాఘవులు , నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత - శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు అధికారులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో జాతర మహోత్సవంలో పాల్గొన్నారు.

## ఫైల్ నేమ్.. ఆళ్లగడ్డ పట్టణంలో శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్‌లో చిన్నపిల్లల హాస్పిటల్ ప్రారంభం..



**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ పట్టణం లోని ప్రసాద్ హాస్పిటల్ నందు నూతనంగా వెంకటేశ్వర చిన్న పిల్లల హాస్పిటల్ ప్రారంభించారు. ఎంతో అనుభవం కలిగిన డాక్టర్లచే శ్రీ వెంకటేశ్వర చిన్న పిల్లల హాస్పిటల్ నందు పుట్టిన బిడ్డ నుండి 15 సంవత్సరాలలోపు పిల్లలకు ఏ సమస్య వచ్చినా ఇక్కడ చూడబడునని డాక్టర్ సాహితీ తెలిపారు.ఈ సదవకాశాన్ని ఆళ్లగడ్డ పట్టణ ప్రజలు ఇతర ప్రాంతాల ప్రజలు వినియోగించుకోగలరని డాక్టర్ సాహితీ తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి,డాక్టర్ ఎన్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ వసంత,డాక్టర్ శీలం సురేంద్ర నాథ్ రెడ్డి, డాక్టర్ గణపతి రావు, డాక్టర్ లక్ష్మి శేఖర్ రెడ్డి, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ ఆంజనేయులు, ఏ వి రామ సుబ్రమణ్యం డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ కేశవరెడ్డి, డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి, డాక్టర్ కృష్ణమోహన్ రెడ్డి, డాక్టర్ సుదర్శన్ రెడ్డి, డాక్టర్ అనీస, తదితరులు పాల్గొన్నారు.

## నలువైపుల విస్తరిస్తున్న కమలదళం

**- మోదీ ఆశయాలే గెలుపుకు సోపానాలు.**
**- పత్తికొ.లిండ నియోజకవర్గ బిజెపి నాయకులు నవీన్ రెడ్డి.**

**తుగ్గలి:** దేశంలోని నలువైపులా కమలదళం విస్తరించి విజయ పరంపరను కొనసాగిస్తుందని పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకులు తుగ్గలి నవీన్ రెడ్డి తెలియజేశారు.సోమవారం రోజున వెలువడిన ఎన్నికల ఫలితాలలో పశ్చిమ బెంగాల్,పుదుచ్చేరి,అస్సాం ఫలితాలలో బిజెపి విజయం సాధించడంతో మోడీ మానియా కనిపించిందని ఆయన తెలియజేశారు. మోడీ ఆశయాలతోనే ఈ విజయాలను భారతీయ జనతా పార్టీ తన ఖాతాలో వేసుకున్నదని బిజెపి నాయకులు నవీన్ రెడ్డి తెలియజేశారు.భారతీయ జనతా పార్టీపై ప్రజలు చూపిస్తున్న నమ్మకాన్ని ప్రధాన మంత్రి మోడీ తప్పకుండా నెరవేరుస్తారని ఆయన తెలియజేశారు. మండలంలోని గల ప్రతి మారుమూల ప్రాంతంలో కూడా బిజెపి జెండా ఎగిరేల తనవంతు కృషి చేస్తానని పత్తికొండ నియోజకవర్గం బిజెపి నాయకులు తుగ్గలి నవీన్ రెడ్డి తెలియజేశారు.ఈ సందర్భంగా మండల కేంద్రమైన తుగ్గలి నందు బిజెపి మండల అధ్యక్షుడు లక్ష్మన్న బాణాసంచాలను పేలుస్తూ బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు.

## నేడు కొలిమిగుండ్ల మండలంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పర్యటన

**కొలిమిగుండ్ల** నేడు కొలిమిగుండ్ల మండలంలో పర్యటిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి సోమవారం నాడు తెలిపారు. మండలంలోని హనుమంతు గుండం గ్రామంలో జల ధార జల హారతి, కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొంటారు. అలాగే కొలిమిగుండ్ల మండలంలోని బందార్ల పల్లె చెక్ పోస్ట్ వద్ద ఆరో ప్లాంట్ కోసం మంత్రి స్థలాన్ని పరిశీలన చేస్తారు. అలాగే గోరుమానుపల్లె గ్రామంలో ఆర్ఓ ప్లాంట్ మరియు అంగన్వాడి కేంద్రాలను మంత్రి బీసీ ప్రారంభిస్తారు. అలాగే పెట్టికోట గ్రామంలో ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్లను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు అవుకు పట్టణంలో జరిగే శ్రీ భూలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి వారి రథోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నాలుగు గంటల 30 నిమిషాలకు కొలిమిగుండ్ల మండల కేంద్రంలో జరిగే శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కావున మండలంలోని కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మూలే రామేశ్వర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కోటపాడు శివరామిరెడ్డి పాల్గొన్నారు.

## మహిళల భద్రతే పోలీసుల కర్తవ్యం...

**- తుగ్గలి ఎస్ఐ నరేష్**
**- పెండేకల్లు ఆర్ఎస్ నందు ప్రజలకు అవగాహన కల్పించిన పోలీసులు.**



**తుగ్గలి:** సమాజంలోని మహిళలు,చిన్నారుల భద్రతే పోలీసుల కర్తవ్యమని తుగ్గలి ఎస్ఐ నరేష్ తెలియజేశారు.ప్రస్తుత సమాజంలో మహిళలపై,చిన్నారులపై జరుగుతున్నటువంటి అఘాయిత్యాలపై తుగ్గలి ఎస్సై నరేష్ తమ పోలీస్ సిబ్బందితో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల పెండేకల్లు ఆర్ఎస్ గ్రామం నందు ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ప్రస్తుత సమాజంలో మహిళలపై,చిన్నారులపై జరుగుతున్నటువంటి మోసాల గురించి,ఐవిఆర్ఎస్ కాల్స్ వారు అవగాహన కల్పించారు.స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతి ఒక్క మహిళ తమ ఫోన్ నందు శక్తి యాప్ను తప్పకుండా ఇన్స్టాల్ చేసుకోవాలని ఎస్సై మల్లికార్జున తెలియజేశారు.ఈ శక్తి యాప్ లోని జిపిఎస్ ఆధారంగా పది నిమిషాలలోపు పోలీసులు అక్కడికి చేరుకొని మహిళలను రక్షించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.అదేవిధంగా ప్రస్తుత సమాజంలో జరుగుతున్న డిజిటల్ మోసాలపై కూడా మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలియజేశారు.మహిళలపై జరుగుతున్నటువంటి అఘాయిత్యాలను 100,112 నంబర్లకు కాల్ చేసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తుగ్గలి ఎస్ఐ నరేష్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి పోలీస్ సిబ్బంది, పెండేకల్ ఆర్ఎస్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

**- ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి**
**- జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**జగిత్యాల** ప్రజావాణికి వచ్చిన అర్జీలపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ లతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తున్నారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 76 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జనాభ లెక్కల - స్వీయ గణన -2027 పై జిల్లా స్థాయి అధికారులకు సోమవారం సాయంత్రం ప్రతి ఉన్నతాధికారి తమ కింది స్థాయి ఉద్యోగుల వరకు అందరు సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లాలో విషాదం

**అల్లూరి** ఈదురు గాలులు. ఉరుములు,మెరుపులతో కూడిన కూడిన భారీ వర్షానికి కూరగాయల వ్యాపారం చేసే ఇద్దరు మహిళలపై చెట్లు విరిగి పడడంతో ఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతి చెందిన మహిళలు ఒడిశాకు చెందిన జర్రయి గ్రామస్తులుగా గుర్తించారు.

# విశ్వనాథన్ గెలిచారు,శ్రీ గణేష్ మురిశారు.

**- విశ్వనాథన్ పెరుమాళ్ విజయం పట్ల హర్షం వ్యక్తం చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐసీసీ తెలంగాణ సెక్రటరీ,అభ్యర్థి విశ్వనాథన్ పెరుమాళ్ తరపున మధురై జిల్లా మేలూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రచారం చేసి,కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రతికూల పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడం,విశ్వనాథన్ పెరుమాళ్ నాయకత్వానికి ప్రజల మద్దతు లభించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు.విశ్వనాథన్ పెరుమాళ్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ నాపై నమ్మకంతో ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రచారానికి పంపడం, మొన్నీ మధ్య జూబ్లీహిల్స్ బై ఎలక్షన్స్ లో కూడా ఎన్నికల ప్రచారంలో తనదైనశైలితో దూసుకుపోయిన విషయాన్ని గుర్తు చేశారు.అలాగే ఆ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలవడం అందరికి తెలిసిందే. నిన్న సోమవారం తమిళనాడులో కూడా శ్రీ గణేష్ ప్రచారం చేసిన చోట విశ్వనాథన్ పెరుమాళ్ గెలవడం మరింత ఉత్సాహంగా పని చేయడానికి దోహదం చేస్తుందని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ఎక్కువ ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని మెదక్ కలెక్టర్ ప్రతిమ సింగ్ సూచించారు.భూసార పరీక్షల విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవ కార్యక్రమాలు మెదక్ జిల్లాలో పలు రైతు వేదికలలోఘనంగా జరుగుతున్నాయి. సోమవారం మెదక్ కలెక్టర్ ప్రతిమ సింగ్ కౌడిపల్లి రైతు వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటలైన కూరగాయలు, పూల మొక్కలు సాగు చేసుకోవాలని సూచించారు. కౌడిపల్లి, చేగుంట, తూప్రాన్ లో కొందరు రైతులు ఆ దిశగా సాగు చేస్తున్నారని పేర్కొన్నారు.మెదక్ జిల్లా హైదరాబాద్ కు దగ్గరలో ఉంది కనుక మార్కెట్ చేసుకోవడానికి సులువుగా ఉంటుందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న “రైతు వారోత్సవాలు--2026” కార్యక్రమాన్ని జిల్లాలో మే 04 నుండి మే 09 వరకు అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, రైతు వేదికలు, క్లస్టర్ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ప్రజాభిమానాన్ని పొందేలా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఉత్పత్తి వ్యయాల పెరుగుదల, మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ పద్ధతులు అవలంబించడం అత్యవసరమని తెలిపారు. అందుకోసం రైతు వారోత్సవాల ద్వారా ప్రతి రైతుకు నేరుగా చేరుకుని, క్షేత్రస్థాయిలో సమగ్ర అవగాహన కల్పించాలని అధికారులను కోరారు.
జిల్లాలోని ప్రతి గ్రామంలో ఒక్క రైతు కూడా మిగలకుండా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, రైతు వేదికలను కేంద్రబిందువుగా చేసుకుని రైతులతో ముఖాముఖి సమావేశాలు, క్షేత్ర ప్రదర్శనలు, సాంకేతిక సదస్సులు, ప్రత్యక్ష శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,స్థానిక వ్యవసాయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## డీజీపీని కలిసిన బీజేపీ నేతలు



**హైదరాబాద్** నూతనంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ ని సోమవారం నాడు బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## అనిమల్ హాస్టల్ నిర్మాణం కొరకు ప్రభుత్వ స్థలానికి అనుమతులు ఇవ్వండి

**తుగ్గలి** తుగ్గలి మండల పరిధిలోని రాంపల్లి గ్రామం నందు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న అనిమల్ హాస్టల్ కు ప్రభుత్వ స్థలానికి అనుమతులు ఇవ్వాలని మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ లు తహసిల్దార్ రవికు సోమవారం రోజున వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంపల్లి గ్రామ సమీపంలో సర్వే నంబర్ 470 నందు 50 సెంట్ల ప్రభుత్వ భూమి కలదని,ఆ ప్రభుత్వ భూమిని అనిమల్ హాస్టల్ నిర్మాణం కొరకు మంజూరు చేయాలని తహసిల్దార్ కు తెలియజేశారు.రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని ఆమోదిస్తే కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా ఎనిమల్ హాస్టల్ నిర్మాణం చేపడతామని వారు తహసిల్దార్ కు తెలియజేశారు.

# మత్తులో మంథని అబ్కారి శాఖ.

**పట్టణం బయట అబ్కారి శాఖ...**

**పట్టణం లోపల బెల్ట్ షాపులు..**

**ఓ ఆబ్కారి శాఖ సీఐకి ఓ వైన్ షాపులో పొత్తు...?**

**ఆబ్కారి ఆఫీసు ఉన్నట్టా..? లేనట్టా..?**

**గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు.**

**మత్తుకు బానిసవుతున్న యువత .**

**కన్నెత్తి చూడని అధికారులు..**

**ఎక్సైజ్ శాఖ అధికారులపై పలు అనుమానాలు.**






మంథని ( ప్రశ్న న్యూస్) పెద్దపెల్లి జిల్లా మంథని మండలంలో మద్యం ఏరులై పారుతుంది. గ్రామాల్లో బెల్టు షాపులు పుట్టగొడుగుల్ల వేలుస్తున్నాయి. దీంతో గ్రామాల్లో బెల్ట్ షాపులో మద్యం దోరకడంతో యువకులు మత్తుకు బానిస అవుతున్నారు. మంథని ఆప్కారి సిఐ పై వాళ్ళ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బెల్టు షాపులకు పర్మిషన్ ఇస్తూ లక్షల్లో సంపానా ఆప్కారి సిఐ అని ప్రజల్లో చర్చ జరుగుతుంది. మంథని పట్టణంలో కూడా గల్లీ గల్లీకో బెల్టు షాప్ లు వెలుస్తున్నాయి. అయితే బెల్ట్ షాపులను అరికట్టాల్సిన ఆబ్కారి శాఖ అధికారులు మాత్రం పర్యవేక్షణ లేదు. దీంతో బెల్ట్ షాపు లు నడిపించే వ్యక్తులు ఇష్ట రాజ్యాంగా మద్యాన్ని అమ్ముతూ... దనార్జన ధ్యేయంగా బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని రోజుల నుండి పట్టణానికి బయట అబ్కారి శాఖ ఆఫీసు ఉండడంతో ప్రజలకు ఈ ఆఫీసు ఎక్కడ ఉందో..? కూడా తెలియని పరిస్థితి స్థానిక ప్రజల్లో నెలకొంది.మంథని పట్టణం ఒక షాపులో ఆప్కారి సిఐ పెట్టుబడి పెట్టిండు అనేది ప్రజల్లో పెద్ద చర్చ జరుగుతుంది . బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్ల వేలుస్తున్నాయి.దీంతో మత్తులో మంథని అబ్కారి శాఖ ఉందో..? ననే విమర్శలు ప్రజా సంఘాల నుండి వినిపిస్తున్నాయి. కాగా ఓ ఆబ్కారి శాఖ అధికారికి ఓ వైన్ షాపులో పొత్తు...? ఉన్నట్టుగా కూడా మంథని పట్టణంలో గుస గుసలు వినిపిస్తూన్నాయి.బెల్ట్ షాపులను అరికట్టాల్సిన ఆబ్కారి శాఖ అధికారీ ఏకంగా మద్యం పొత్తులో ఉండడం ఏంటని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే మంథని లో ఆబ్కారి ఆఫీసు ఉన్నట్టా..? లేనట్టా..? అని స్థానికుల్లో ఆరోపణలు గట్టిగానే వినబడుతున్నాయి. అయితే గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలువడంతో యువత మత్తుకు బానిసవుతున్నారు. అబ్కారీ శాఖ అధికారులు బెల్ట్ షాపుల వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామాల ప్రజల్లో తీవ్రంగా ఆరోపణ చేస్తున్నారు. రాజకీయ విశ్లేషకులు ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు.

# నవ కంటోన్మెంట్ నిర్మాణబాటలో ఎమ్మెల్యే శ్రీ గణేష్.

**- నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటలో భాగంగా వార్డు 3లో క్షేత్రస్థాయి పర్యటన చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్**

**- ప్రజా పాలన,ప్రగతి ప్రణాళికలో ప్రభుత్వ పథకాల పై నియోజకవర్గంలో విస్తత స్థాయి అవగాహన సదస్సులు:ఎమ్మెల్యే**

**మహాలక్ష్మి పథకం ద్వారా కంటోన్మెంట్ లో “12,220. మంది లబ్ధిదారులకు: 2,18,23,000 రూపాయలు సబ్సిడీ లభించింది.**

**గృహ జ్యోతి ద్వారా నియోజకవర్గం మొత్తం: 25,000.లబ్ధిదారులు ఉపయోగించుకుంటే, దాదాపు సబ్సిడీ: 1,07,41,762 రావడం విశేషం.**

**చేయూత పెన్షన్లు,వృద్ధాప్య పెన్షన్లు:3,427.దివ్యాంగుల పెన్షన్లు:1,231.ఒంటరి మహిళ పెన్షన్లు:517.విధవల పెన్షన్లు:4,283.**

**కళ్యాణ లక్ష్మి:479, షాదిముబారక్:306.**

**లబ్ధి పొందినట్లు తెలుస్తోంది. కొత్త రేషన్ కార్డులు:4730**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు చేపట్టి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న సమయంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు సర్కార్ పథకాలు ఏమాత్రం ఉపయోగించుకున్నారో వారి వివరాలు స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ నిన్న బోర్డు పరిధిలో ఉన్న మూడో వార్డులో “నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటకార్యక్రమంలో వివరాలు వెల్లడించారు.గతంలో ఏ ప్రభుత్వం చేయలేని పనులు కేవలం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అయ్యాయని చెప్పారు.ఇదే క్రమంలో “మహాలక్ష్మి పథకం ద్వారా నియోజకవర్గంలో ఉన్న తిరుమల గిరి మండల ప్రజలు:12,220 మంది వంటగ్యాస్ సబ్సిడీ సుమారు:2,18,23,000 రూపాయలు మంజూరు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కూడా స్థానికులు ఇంటిని నిర్మించుకునేందుకు స్థలం ఉన్న వారు:275 మంది లబ్ధిదారులు ఉన్నారు.జాగ లేకుండా ఇల్లు కోసం దరఖాస్తులు చేసుకున్న వారు సుమారు:20,735.అలాగే పక్కా ఇల్లు ఉన్న వారి సంఖ్య :3,056 మంది ఉన్నట్లు వెల్లడించారు.పేదవాడి జీవితంలో వెలుగులు నింపే పథకం.గృహజ్యోతి:ఈ పథకం కింద నియోజకవర్గం పరిధిలో ఉన్న:79 శాతం ప్రజలు:1,07,41,762 సబ్సిడీ పొందినట్లు గణాంకాలు చెబుతున్నాయి.ఇక చేయూత పెన్షన్లు: తిరుమల గిరి మండలంలో వృద్ధాప్య పెన్షన్లు:3,427.దివ్యాంగుల పెన్షన్లు:1,231.ఒంటరి మహిళ పెన్షన్లు:517.విధవల పెన్షన్లు:4,283 మందిని గుర్తించారు.కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్ ద్వారా ఒక్క తిరుమల గిరి మండలంలో:785 మంది లబ్ధి పొందారు.గత సర్కార్ అయితే రెండు సార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ పేదవాడి బ్రహ్మాస్త్రం అయిన “రేషన్ కార్డులు”ఇచ్చిన దాఖలాలు లేవు.అలాంటిది తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో పరిధిలో:36,348 మంది రేషన్ కార్డులు ఉండగా, తిరుమల గిరి మండలంలో కొత్త రేషన్ కార్డులు కోసం:7,245 మంది దరఖాస్తులు చేసుకోగా అందులో:4,730 మందికి మంజూరు అయినట్లు తెలుస్తోందని ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు.ఆయనప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేపట్టిన నవ కంటోన్మెంట్ నిర్మాణ బాట కార్యక్రమంలో భాగంగా నిన్న సోమవారం వార్డు 3 బాలంరాయి,దండు మారెమ్మ దేవాలయ ప్రాంతం అంబేద్కర్ సొసైటీ తదితర బస్తీలలో సంబంధిత అధికారులు,స్థానిక నాయకులతో కలిసి బస్తీలు పర్యటించారు.

పర్యటనలో భాగంగా స్థానికులు డ్రైనేజీ వ్యవస్థ, మంచినీరు, అంతర్గత రహదారుల ఏర్పాటు వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి,అవసరమైన చోట నిధులు కేటాయించి పనులను త్వరగా పూర్తి చేయిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.ప్రజల సౌకర్యమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని,నవ కంటోన్మెంట్ నిర్మాణం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మూడో వార్డు ఇన్చార్జ్ రాజేష్ యాదవ్, మురళీ,దర్గ రవి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా యాసంగి వారి ధాన్యము కొనుగోలు చేపట్టాలి.

**రాష్ట పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) రైతులకు ఎలాంటి ఇబ్బందులు యాసంగి వరి ధాన్యము కొనుగోలు చేయాలనీ రాష్ట పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తశీ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని రాష్ట సచివారయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రబాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిలా శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ కుమార్, రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టిఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషన్ ఇలంబర్తి తో కలిసి రాష్ట పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి విడియో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్టంలో అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాలలో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పలిన్ కవర్లు, అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తున్నందున రైతులు తమ ధాన్యం కుప్పలను ఎత్తు ప్రాంతంలో ఉంచుకోవాలన్నారు. గాలులకు టార్పాలిన్ కవర్లు ఎగిరి పోతున్నాయని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు తెలియ జేయలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగు నీరు, షామియానా, ఓ ఆర్ ఎస్, ప్యాకెట్లు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మైచర్ యంత్రాలు ఆటో మేటిక్ ప్యాడి క్లెనర్ లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు పంపించాలన్నారు. ఎక్కడ కుడా జాప్యం, చేయకుడదన్నారు. హమిలిలు, వాహనాల కొరత రాకుండా సర్దుబాటు చేసుకోవాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాలకు గ్రామ స్థాయి అధికారులు మండల స్థాయి అధికారులు పర్య వేక్షించాలన్నారు. మే నెల చివరి కల్లా 80% ధాన్యము కొనుగోళ్ళు పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని విడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్ వివిధ శాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కొనుగోలు కేంద్రంలో మైచర్ యంత్రం, ఆటో మేటిక్ ప్యాడి క్లేనర్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి 100 చొప్పున టార్పలిన్ కవరు అందించాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. హమాలీల కొరత, వాహనాల కొరత లేకుండా స్థానికంగా వున్నా హమాలిలను ,వాహానాలను సర్దు బాటు చేసుకోవాలన్నారు. చివరి గింజ వరకు కొనుగోలు చర్యలు తిసుకుంటామన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఎక్కడ కుడా జాప్యం జరుగకూడదన్నారు. సమన్వయంతో పని చేసి యాసంగి వరి ధాన్యం కొనుగోలు పూర్తీ చేయాలన్నారు. ఎక్కడ నిర్లక్ష్యం వహించాకుదన్నారు.ఈ విడియో కాన్ఫరెన్స్ లో రవాణశాఖ మార్కెటింగ్ శాఖ , పౌర సరఫరాల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 'గ్లోరీ' సిరీస్ రివ్యూ!




మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన వెబ్ సిరీస్ గా 'గ్లోరీ' కనిపిస్తుంది. కనిష్క్ వర్మ – కరణ్ అన్శుమాన్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్ లో దివ్యేందు శర్మ – పుల్కిత్ సామ్రాట్ ప్రధానమైన పాత్రలను పోషించారు. 7 ఎపిసోడ్స్ గా నిర్మితమైన ఈ సిరీస్ లో ఒక్కో ఎపిసోడ్ నిడివి 45 నిమిషాల నుంచి 60 నిమిషాల వరకూ ఉంది. ఈ నెల 1వ తేదీ నుంచి హిందీతో పాటు ఇతర భాషల్లోను స్ట్రీమింగ్ అవుతోంది. రఘువీర్ సింగ్ ( సువిందర్ విక్కీ) 'శక్తి గఢ్'లో హర్యానా బాక్సింగ్ క్లబ్ ను నిర్వహిస్తూ ఉంటాడు. అదే సిటీలో విజూ సాంగ్వాన్ (అశుతోష్ రాణా) శక్తి బాక్సింగ్ అకాడమీని నడుపుతుంటాడు. ఈ రెండు ట్రైనింగ్ సెంటర్ల మధ్య గట్టిపోటీ నడుస్తుంటుంది. ఒలింపిక్స్ లో పాల్గొనడం కోసం తన శిక్షణా కేంద్రం నుంచి నిహాల్ ను తయారు చేస్తుంటాడు రఘువీర్ సింగ్. అతని కూతురు 'గుడియా', నిహాల్ ను ప్రేమిస్తూ ఉంటుంది. నిహాల్ కారణంగా ఆమె గర్భవతి అవుతుంది. ఊరు వదిలి పారిపోవాలని అనుకున్న ఆ జంటపై కొంతమంది ఆగంతకులు దాడి చేస్తారు. ఆ దాడిలో నిహాల్ చనిపోగా, గుడియా చావుబతుకుల్లో ఉంటుంది. ఈ విషయం తెలియగానే ఆమె సోదరులైన దేవేందర్ సింగ్ (దివ్యేందు శర్మ) రవి వీర్ సింగ్ (పుల్కిత్ సామ్రాట్) తమ ఊరికి తిరిగొస్తారు. తమపై దాడి చేసిన వ్యక్తులు చిత్రమైన మాస్కులు ధరించారని చెప్పిన 'గుడియా', హాస్పిటల్లో బెడ్ పైనే హత్య చేయబడుతుంది. ఈ కేసును సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడం కోసం స్పెషల్ పోలీస్ ఆఫీసర్ గా 'అరవింద్' రంగంలోకి దిగుతాడు. అరవింద్ – రవివీర్ సింగ్ కలిసి చదువుకోవడం వలన వారి మధ్య మంచి స్నేహం ఉంటుంది. ఈ కారణంగానే అరవింద్ భార్య భారతి (కాశ్మీర పరదేశి) తోను ఆ కుటుంబానికి చనువు ఏర్పడుతుంది. నిహాల్ – గుడియాపై జరిగిన దాడిలో విజూ సాంగ్వాన్ .. సర్పంచ్ డాండా .. కుకీ యాదవ్ ప్రమేయం ఉండొచ్చని అరవింద్ భావిస్తాడు. ఆ వెంటనే అతణ్ణి ఆ కేసు నుంచి తప్పిస్తారు. దాంతో జరిగిన సంఘటనకి కారకులెవరనేది తెలుసుకోవడానికి దేవేందర్ సింగ్ – రవి వీర్ సింగ్ రంగంలోకి దిగుతారు. నిహాల్ పై జరిగిన దాడిలో గుడియా చనిపోయిందని అనుకున్న వాళ్లకి, గుడియా కారణంగానే నిహాల్ చనిపోయాడని తెలుసుకుని షాక్ అవుతారు. జరిగిన సంఘటనకు కారకులు ఎవరు? ఆ అన్వేషణలో వాళ్లకి తెలిసే చేదు నిజాలేమిటి? అరవింద్ భార్య భారతి నేపథ్యం ఏమిటి? అనే మలుపులతో ఈ కథ కొనసాగుతుంది.

ఒక ప్రేమజంటపై జరిగిన దాడితో ఈ కథ మొదలవుతుంది. డబ్బు .. అధికారం .. పలుకుబడి కలిగిన ముగ్గురు వ్యక్తులు ఆ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తుంటారు. వాళ్లను పోలీసులు ఏమీ చేయలేని పరిస్థితి. దాంతో తమ చెల్లెలికి జరిగిన అన్యాయానికి కారకులెవరనేది తెలుసుకోవడానికి గుడియా సోదరులు రంగంలోకి దిగడమనేది ఈ కథపై ఆడియన్స్ కి ఆసక్తిని పెంచే మొదటి అంశంగా కనిపిస్తుంది. బాక్సింగ్ లో నిహాల్ ఎదుగుదలను అడ్డుకోలేక అతనిని హత్య చేసి ఉంటారని భావించిన గుడియా సోదరులకి, శత్రువుల అసలు టార్గెట్ తమ చెల్లెలేనని తెలుసుకుని ఉలిక్కిపడతారు. ఆమెను ఎవరు ఎందుకు చంపాల్సి వచ్చిందనే సందేహం, ఆడియన్స్ లో మరింత కుతూహలాన్ని పెంచుతుంది. అక్కడి నుంచి ఈ కథ మరిన్ని మలుపులు తీసుకుంటూ, మరింత ఉత్కంఠభరితంగా మారుతుంది. ఈ కథలో నెమ్మదిగిగా జర్నలిస్ట్ జోయ్ నా .. అరవింద్ భార్య భారతి పాత్రలు నిదానంగా బలపడుతూ వెళుతుంటాయి. చూస్తుండగానే ఆ పాత్రలు కీలకమైనవిగా మారిపోతాయి. ఈ రెండు పాత్రలు కూడా ఆయా సన్నివేశాలకు మరింత బలాన్ని చేకూర్చుతూ వెళతాయి. ప్రధానమైన ప్రతినాయకులు .. వాళ్ల అనుచరులు .. కీలక పాత్రలు ఈ కథను ఎప్పటికప్పుడు నెక్స్ట్ లెవెల్ కి తీసుకుని వెళతాయి. కథ కథనాలు చాలా బలంగా కనిపిస్తాయి. ఈ సిరీస్ కి స్క్రీన్ ప్లే ప్రాణంగా నిలిచిందని చెప్పాలి. ఎప్పటికప్పుడు ఇస్తూ వచ్చిన ట్విస్టులు కథను కదలకుండా ఫాలో అయ్యేలా చేస్తాయి. వేశ్యాగృహం .. జైలు నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు హైలైట్ గా నిలుస్తాయి. అలాగే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ కూడా చాలా ఇంట్రెస్టింగ్ గా కొనసాగుతాయి. ఆడియన్స్ అంచనాలకు అందనిదిగా క్లైమాక్స్ ఉంటుంది. ప్రధానమైన రెండు పాత్రలు సమాంతరంగా .. సమానమైన ప్రాధాన్యతతో నడుస్తాయి. ఆయా పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా చాలా సహజంగా చేశారు.

కాశ్మీర పరదేశి ఈ సిరీస్ మొత్తానికి ప్రత్యేకమైన ఆకర్షణగా చెప్పుకోవాలి. చాలా అందంగా కనిపిస్తూ .. తన హావభావాలతో కట్టిపడేస్తుంది. నిర్మాణ విలువల విషయంలో రాజీ పడలేదనే విషయం తెలిసిపోతూనే ఉంటుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఈ కథకి పూర్తిస్థాయిలో సపోర్టు చేశాయి. రక్తపాతం ఎక్కువగానే కనిపించే సిరీస్ ఇది. ఈ ఒక్క విషయాన్ని పక్కన పెడితే, పక్కాగా తయారు చేసుకున్న స్క్రిప్ట్ .. ఆర్టిస్టుల ఎంపిక .. స్క్రీన్ ప్లే .. ట్విస్టులు .. క్లైమాక్స్ ఈ సిరీస్ కి మంచి మార్కులు తెచ్చిపెడతాయని చెప్పచ్చు.

## మద్యం అలవాటుపై జాన్వీ వ్యాఖ్యల వక్రీకరణ

**– మీడియా సంస్థలపై నటి టీమ్ ఫైర్!**

యువ నటి జాన్వీ కపూర్ ఇటీవల ఒక పాడ్‌క్యాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం గురించి పంచుకున్న విషయాలను కొన్ని మీడియా సంస్థలు తప్పుగా వక్రీకరించడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం వ్యసనంపై అవగాహన కల్పించే 'ఆఫ్ ది రాక్స్', 'అమహా' సంస్థలు నిర్వహించిన కార్యక్రమంలో జాన్వీ పాల్గొని, జీవితంలోని ఒడిదుడుకులపై మాట్లాడారు. అయితే, ఆమె మాటలను సందర్భం లేకుండా ప్రచారం చేస్తూ జాన్వీకి మద్యం అలవాటు ఉందనే అర్థం వచ్చేలా కథనాలు రాయడంపై ఆమె వ్యక్తిగత టీమ్ స్పందించింది. ఆయా కథనాలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, జాన్వీ కేవలం అవగాహన కోసమే ఆ కార్యక్రమంలో భాగమయ్యారని సదరు పాడ్‌క్యాస్ట్ సంస్థలు కూడా స్పష్టం చేశాయని టీమ్ వెల్లడించింది. తన అనుభవాల వెనక ఉన్న అసలు ఉద్దేశాన్ని పక్కన పెట్టి అవాస్తవాలను వైరల్ చేయడం బాధాకరమని పేర్కొంది. సదరు పాడ్‌క్యాస్ట్ సంస్థలు విడుదల చేసిన నోట్‌ను జాన్వీ తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. "వాస్తవాలు తెలుసుకోండి.. అవాస్తవాలను ప్రచారం చేయకండి" అంటూ ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు. ప్రస్తుతం జాన్వీ తెలుగులో 'పెద్ది' సినిమాలో నటిస్తూ బిజీగా ఉన్నారు.



'వారణాసి' షూటింగ్‌కు

# నీటి కష్టాలు..

## – రాజమౌళి ప్లాన్‌కు బ్రేక్ పడిందా!



సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. భారీ బడ్జెట్‌తో శ్రీ దుర్గా ఆర్ట్స్, షోయింగ్ బిజినెస్ బ్యానర్లపై నిర్మితమవుతున్న ఈ చిత్రం కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భారీ సెట్లు నిర్మించారు. ముఖ్యంగా రాజేంద్రనగర్‌లోని గగన్‌పహాడ్ ప్రాంతంలో వేసిన సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.తాజాగా ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సినిమాలో భాగంగా నీటి అడుగున జరిగే కొన్ని సన్నివేశాలను చిత్రీకరించేందుకు రాజమౌళి ప్లాన్ చేశారట. ఇందుకోసం భారీ స్థాయిలో నీరు అవసరమవుతుందని, దాదాపు 10 వేల లీటర్ల సామర్థ్యం గల 150 ట్యాంకర్ల నీటిని సరఫరా చేయాలని నిర్మాణ సంస్థ హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డును సంప్రదించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఎండలు తీవ్రంగా ఉండటం, నగరంలో నీటి డిమాండ్ అధికంగా ఉండటంతో ఈ అభ్యర్థనను వాటర్ బోర్డ్ తిరస్కరించిందని వార్తలు వినిపిస్తున్నాయి. సరఫరా చేసే నీటిని శుద్ధి చేసి వినియోగించుకోవాలని, ట్యాంకర్ ఛార్జీలను నిర్మాతలే భరిస్తారని లేఖలో పేర్కొన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అంతటి నీటిని అందించడం సాధ్యం కాదని అధికారులు తెలిపినట్లు సమాచారం. అయితే ఈ విషయంపై అధికారిక ధృవీకరణ ఇంకా వెలువడలేదు. ఇక మరోవైపు మహేష్ బాబు ఇటీవల జర్మనీకి వెళ్లి బ్లాక్ ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్, ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలోనే తదుపరి షెడ్యూల్ ప్రారంభం కానుండగా, మే 18 నుంచి అండర్‌వాటర్ సన్నివేశాల షూటింగ్ చేపట్టాలని చిత్రబృందం యోచిస్తోంది. ఈ సినిమాలో మహేష్ బాబు ద్విపాత్రాభినయం పోషిస్తుండగా, 'రుద్ర' మరియు 'శ్రీరాముడు' పాత్రల్లో కనిపించనున్నారని టాక్. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాశ్ రాజ్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కథను విజయేంద్ర ప్రసాద్ అందిస్తుండగా, సంగీతాన్ని ఎం.ఎం. కీరవాణి సమకూరుస్తున్నారు. 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ భారీ చిత్రం గురించి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం నీటి వివాదం నిజమా కాదా అన్నది క్లారిటీ రావాల్సి ఉంది.

బాడీ షేమింగ్‌తో

## నరకం చూశా..

**– 15 రోజులు ఆసుపత్రిలో చికిత్స: సుప్రిత ఎమోషనల్**



ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సురేఖా వాణి కుమార్తెగా ప్రేక్షకులకు పరిచయమైన సుప్రిత ఇటీవల తన వ్యక్తిగత జీవితంలోని కఠిన అనుభవాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. సోషల్ మీడియా స్టార్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, ప్రస్తుతం హీరోయిన్‌గా సినీ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సుప్రిత, సోషల్ మీడియాలో ఎదురైన విమర్శలు, బాడీ షేమింగ్ కామెంట్లు తనపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు. బరువు తగ్గాలనే ఆరాటంలో తాను అనుసరించిన తప్పుడు ఆహారపు అలవాట్లు తన ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీశాయని వెల్లడించారు.రోజుకు 15 గంటల పాటు ఏమీ తినకుండా ఉండి, తర్వాత ఒక్కసారిగా హెవీ ఫుడ్ తీసుకునేదాన్ని. దీంతో వాంతులు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చాయి.15 రోజుల పాటు ఆసుపత్రిలో ఉండాల్సి వచ్చింది. నీళ్లు తాగినా కూడా పడని పరిస్థితి. ఆ నొప్పి తట్టుకోలేక ఒక దశలో 'నన్ను చంపేయండి' అని అమ్మను అడిగాను అంటూ తన అనుభవాన్ని వివరించారు. ఈ ఘటన తనను మానసికంగా కూడా తీవ్రంగా ప్రభావితం చేసిందని చెప్పారు. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్న సుప్రిత తన కెరీర్‌పై స్పష్టతతో ముందుకు సాగుతున్నారు. కేవలం హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా, మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలు వస్తే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా నటించడానికి సిద్ధమని తెలిపారు.ఇక అగ్ర హీరోల సినిమాల్లో కూడా తాను నటించాలనే ఆసక్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ సినిమాల్లో చెల్లెలి పాత్రలు వచ్చినా చేయడానికి రెడీ అని చెప్పారు. అయితే తనకు ఇష్టమైన విజయ్ దేవరకొండ, అఖిల్ అక్కినేని సరసన అలాంటి పాత్రలు చేయడం కష్టమని సరదాగా వ్యాఖ్యానించారు. సుప్రిత ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తల్లి ప్రోత్సాహంతో నటనలో శిక్షణ తీసుకున్న ఆమె, ఇప్పటికే కొన్ని సినిమాల ద్వారా ప్రేక్షకులను అలరించారు. బిగ్ బాస్ ఫేమ్ అమర్ దీప్ చౌదరి సరసన నటిస్తున్న 'చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. 2019లో 'మనీ మైండెడ్ గర్ల్ ఫ్రెండ్' షార్ట్ ఫిల్మ్‌తో ప్రారంభమైన సుప్రిత ప్రయాణం, ఇప్పుడు వెండితెరపై మరింత బలంగా కొనసాగుతోంది. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా ఆమె అడుగులు వేస్తున్నారు.

నన్ను పెళ్లి చేసుకుంటావా అని

## శ్రీదేవి అడిగింది: రాజశేఖర్

టాలీవుడ్ సీనియర్ నటుడు రాజశేఖర్ తన వివాహ బంధం వెనుక ఉన్న తెలియని కోణాలను తాజాగా



ఒక ఇంటర్వ్యూలో బయటపెట్టారు. కెరీర్ ప్రారంభంలో అగ్ర కథానాయిక శ్రీదేవి తనను పెళ్లి చేసుకోవాలని కోరినట్లు ఆయన సంచలన విషయాన్ని వెల్లడించారు. అయితే, అప్పట్లో తమ కుటుంబంలో కుల కట్టుబాట్లు ఎక్కువగా ఉండటంతో సొంత కులం అమ్మాయినే చేసుకోవాలని తనపై తీవ్ర ఒత్తిడి ఉండేదని రాజశేఖర్ గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలో తన మనసులోని మాటను నటి జీవిత వద్ద ప్రస్తావించగా, ఆమె ఇచ్చిన సమాధానం తనను కదిలించిందని చెప్పారు. "నీకు ఇష్టమైన వ్యక్తిని పెళ్లి చేసుకో.. కానీ నేను మాత్రం జీవితాంతం ఒంటరిగానే ఉండిపోతాను" అని జీవిత చెప్పిందని... దీంతో, ఆమెపై గౌరవం మరింత పెరిగిందని తెలిపారు. ఆ తర్వాత అన్ని అడ్డంకులను అధిగమించి జీవితను రాజశేఖర్ జీవిత భాగస్వామిగా చేసుకున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ ఈ జంట టాలీవుడ్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ సెలబ్రిటీ కపుల్‌గా కొనసాగుతుండటం విశేషం.

## నూతన డిజిపి సివి ఆనంద్‌ను కలిసిన

# ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ ని ఓయూ జేఏసీ ఛైర్మన్ కొత్తపల్లి తిరుపతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర పోలీసు శాఖను సమర్ధవంతంగా ముందుకు నడిపించాలని, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ సహకారం కీలకమని పేర్కొన్నారు. క్యాంపస్‌లలో శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో పోలీసుల పాత్ర కీలకమని అన్నారు. నూతన డీజీపీ సీవీ ఆనంద్ నాయకత్వంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు మరింత బలోపేతం అవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బరిగెల రాజు, మోతే ప్రవీణ్, కిషోర్, శ్రీధర్, చరణ్, రాజేందర్, రాము, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నివర్గాల అభ్యున్నతికి బీజేపీ కట్టుబడి ఉంది

- మోదీ నాయకత్వంపై ప్రజలకు నమ్మకం పెరుగుతోంది
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ విజయం హర్షణీయం
- భాజపా కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకులు : అనుమల్ల చంద్రమౌళి



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్)** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయంపై కరీంనగర్ జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు, కొత్తపల్లి మాజీ ఉప సర్పంచ్ అనుమల్ల చంద్రమౌళి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ విజయాలు దేశంలో అభివృద్ధి, పారదర్శకతకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా భావించవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ముందుకు సాగుతుండగా, ప్రజలు మరోసారి బీజేపీపై విశ్వాసం ఉంచారని ఆయన తెలిపారు. ఈ విజయాన్ని బాధ్యతగా తీసుకొని,అన్ని వర్గాల అభ్యున్నతికి పార్టీ కట్టుబడి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- విలాసాగర్ గ్రామ సర్పంచ్ : ఏనుగుల కనుకయ్య
- నేల ఆరోగ్యం, సన్నాల సాగుపై ప్రత్యేక దృష్టి
- రైతు వారంలో అవగాహన



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 4 నుండి మే 9 వరకు నిర్వహిస్తున్న "రైతు వారం" కార్యక్రమాలు బోయినిపల్లి మండలంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు అయిన మే 4న మండలంలోని నాలుగు రైతు వేదికలలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు నేల ఆరోగ్యం ప్రాముఖ్యత, సమతుల ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా సన్నాల వరి సాగు అంశాలపై రైతులకు వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడాలని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను ఎలా సేకరించాలో వీడియో ప్రదర్శనతో పాటు ప్రత్యక్షంగా చూపించారు. సేంద్రియ, జీవన, రసాయన ఎరువుల వినియోగంపై సమగ్ర ఎరువుల యాజమాన్యం విధానాలను వివరించారు. మార్చి నెలలో పంపించిన మట్టి నమూనాల విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేసి వాటి వివరాలు వివరించారు. అదేవిధంగా పౌరసరఫరాల శాఖ ద్వారా వినియోగదారులకు అందించే సన్న బియ్యంలో ప్రాధాన్యత కలిగిన వరి రకాలైనవంటి రకాలను సాగు చేయాలని సూచించారు. ఈ రకాలపై ప్రభుత్వం కొనుగోలు చేసి బోనస్ కూడా అందజేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విలాసాగర్ సర్పంచ్ ఏనుగుల కనుకయ్య మాట్లాడుతూ, రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రభుత్వ సూచించిన రకాల సాగు చేస్తే మెరుగైన దిగుబడులు, లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి డి. రజిత, రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## కొదురుపాకలో ఘనంగా

# ఆలయాల విగ్రహ ప్రతిష్ట

-- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** చొప్పదండి నియోజకవర్గం, బోయినిపల్లి మండలం, కొదురుపాక గ్రామంలో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, రాజరాజేశ్వర స్వామి దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. మేడిపల్లి సత్యం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యజ్ఞాలు, హోమాలు నిర్వహించి, అనంతరం దేవతా విగ్రహాలను ప్రతిష్టించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి గ్రామ ప్రజల అభివృద్ధి, శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించడంలో ఇలాంటి ఆలయాల నిర్మాణం ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. భక్తి, సాంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లో ముందుకు రావాలి

- ప్రవీణ్ సేవభావం అభినందనీయం
- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం
- ఘనంగా కొలుపుల ప్రవీణ్ జన్మదిన వేడుకలు - నేతల శుభాకాంక్షలు





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ యువనేత కొలుపుల ప్రవీణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సోమవారం చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు,కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లాధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రవీణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, స్వీట్లు తినిపించి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,"యువనేతగా కొలుపుల ప్రవీణ్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు సేవ చేయడం అభినందనీయమైంది. యువత రాజకీయాల్లో ముందుకు రావడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరం. ప్రవీణ్ భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాను. ఆయనకు ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో పాటు అన్ని రంగాల్లో విజయాలు కలగాలి" అని పేర్కొన్నారు. అలాగే మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,బూరుగుపల్లిలో ప్రవీణ్ మిత్రబృందం, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెన్నెల రమణారెడ్డి,కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షులు ల్యాగల దేవయ్య,నాయకులు నిమ్మ వినోద్ రెడ్డి,సంబ లక్ష్మీరాజం,సువిన్ యాదవ్,పిట్టల రమేష్,బూరుగుపల్లి గ్రామ ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య,బూరుగుపల్లి వార్డు సభ్యులు కొలుపుల మల్లేశం,అక్కరాజు తిరుపతి, కల్లెపల్లి మమత - శంకర్,నేతలు అతికం చంద్రయ్య గౌడ్,నాగార్జున్, గ్రామస్తులు సుధాకర్, రాజు,గణేష్, గోపాల్, తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా

- హన్మాజీపేటలో పేకాటపై పోలీసుల దాడి -- ఐదుగురు అరెస్టు
- వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ : చల్లా వెంకట్రాజం



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రూరల్ మండలం,హన్మాజీపేట గ్రామ పరిసర ప్రాంతంలో పేకాట జరుగుతోందన్న సమాచారంతో వేములవాడ రూరల్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నారు. ఈ విషయాన్ని ఎస్ఐ వెంకట్రాజం వెల్లడించారు. ఈ మేరకు ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, రామ్ రెడ్డి, దేవయ్య, సతీష్, భూమయ్య, రణధీర్ రెడ్డి అనే వ్యక్తులు పేకాటలో నిమగ్నమై ఉండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. ఘటన స్థలంలో నుండి పేక ముక్కలు, రూ. 7,750 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ, మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగుతోందని, పేకాట, గంజాయి వంటి అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రజలు ఇటువంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని, సమాచారం ఇచ్చిన వారి గోప్యతను కాపాడుతామని ఆయన స్పష్టం చేశారు.

# దుండ్రపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

- ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం హాజరు
- ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకుంటున్నారు
- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, దుండ్రపల్లి గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద నిర్మించిన గృహంలో లబ్ధిదారురాలు కోడం మంజుల -- శ్రీనివాస్ దంపతుల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చొప్పదండి శాసనసభ్యులు,కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం హాజరై గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఇల్లు కల కలగానే మిగలకుండా, ప్రతి అర్హుడికి గృహం అందించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంతింటి కలను నెరవేర్చుకుంటున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబ సభ్యులను అభినందించి, నూతన గృహంలో సుఖశాంతులతో జీవించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,లబ్దిదారుల కుటుంబ సభ్యులు, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై

# భాజపా శ్రేణుల సంబురాలు

- భాజపా విజయం మోదీ నాయకత్వానికి నిదర్శనం
- భాజపా మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో బీజేపీ శ్రేణులు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో పశ్చిమ బెంగాల్,అస్సాం, పుదుచ్చేరిలో పార్టీ విజయాన్ని పురస్కరించుకొని టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పరశురాం మాట్లాడుతూ దేశ ప్రజలు అభివృద్ధి,పారదర్శక పాలనకు మద్దతుగా మరోసారి బీజేపీకి విజయాన్ని అందించారని, ఇది ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి వర్గానికి న్యాయం చేసే దిశగా పార్టీ మరింత కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా కమిటీ సభ్యులు ఉదారి నరసింహ చారి, మండల ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, మెరుపుల గంగాధర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి,స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, బూరుగుపల్లి సర్పంచ్ పెంచాల సౌమ్య - మహేష్, మండల ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య, పసికాంతి వెంకటేశం, అన్నేమల్ల మోహన్ బాబు, కందారపు వెంకటేష్,మోర్చా అధ్యక్షులు శరత్ చంద్ర రెడ్డి, తిప్పర వేణి శ్రీనివాస్, సుంకపాక ప్రభు, సినీయర్ నాయకులు స్వామి కుమార్, హరీష్, భాస్కర్ రెడ్డి, సింగర్ వెంకటేష్, శేఖర్, నిఖిల్, చంద్రయ్య, కట్ట విజయ్, ముసుగు విజయేందర్ రెడ్డి, మామిడి శెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

- ప్రజావాణిలో బాధితులకు భరోసా కల్పించిన
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు,



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీకి నేరుగా విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడిన ఎస్పీ, వారి సమస్యలను సమగ్రంగా తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని అంశాలపై ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా అధికారులను సంప్రదించాలని ఎస్పీ తెలిపారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం పెరిగిందని ఎస్పీ తెలిపారు.

జాలిగామ చెరువు కట్టపై పిచ్చి చెట్లను తొలగించాలి - రైతుల విజ్ఞప్తి

# కట్ట వెంబడి పెరిగిన సర్కార్ తుమ్మలు కోతులకు ఆవాసాలుగా మారాయి



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో సోమవారం గ్రామ రైతులు గ్రామంలోని నల్లచెరువు కట్టపై పిచ్చి చెట్లు సర్కార్ తుమ్మలు విపరీతంగా పెరిగి కట్టపై రహదారి లేకుండా చేస్తున్నాయని, తమ పంట పొలాల్లోకి వెళ్ళడానికి ఇబ్బందిగా మారిందని, ఏపుగా పెరిగిన చెట్లలో కోతులు మకాం వేశాయని,ఆవేదన వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా బిక్షపతి ముదిరాజ్, కురుమ నర్సింలు,స్వామి మాట్లాడుతూ చెరువు కట్టపైపిచ్చి చెట్లు సర్కార్ తుమ్మ చెట్లు తొలగించాలని ఇటీవల గ్రామ సర్పంచ్ కు వినతిపత్రం అందజేయగా, చెట్లను తొలగించే ప్రయత్నం చేశారు కానీ ఒక్కరోజు ముళ్ళ పొదలను తొలగించే క్రమంలో గ్రామంలోని బిఆర్ఎస్ నాయకులు అడ్డుకొని పనిని ఆపడం జరిగిందని, వెంటనే అధికారులు సర్కార్ తుమ్మలను తొలగించి మాకు న్యాయం చేయాలని కోరారుఅనంతరం గ్రామ సర్పంచ్ తాళ్ళ సునీత ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని రైతుల విజ్ఞప్తి మేరకు చెరువు కట్టపై సర్కార్ తుమ్మలను తొలగించడం జరిగిందని మంచి పనిని అడ్డుకోవడం భావ్యం కాదని గ్రామ అభివృద్ధి కోసం సలహాలు సూచనలు ఇవ్వాలని సూచించారు

# అక్కారం గ్రామంలో ఇంద్రమ్మ ఇల్లు గృహప్రవేశం

- గౌలికారి శ్రీవాణి హనుమంతు



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ అక్కారం గ్రామంలో ఇంద్రమ్మ ఇల్లు గృహప్రవేశం ఘనంగా జరిగింది అక్కారం గ్రామంలో ఇంద్రమ్మ ఇల్లు పథకం కింద నిర్మించిన గృహానికి గృహప్రవేశ కార్యక్రమం శుభంగా జరిగింది. బైరు సతీష్ గౌడ్, మహాలక్ష్మి దంపతుల కొత్త ఇంటి గృహప్రవేశం గ్రామ సర్పంచ్ గౌలికారి శ్రీవాణి హనుమంతు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ అధ్యక్షులు రాజు యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ యాదగిరి, వార్డు సభ్యులు రఫియా బేగం, లక్ష్మీ నరసయ్య, మెతుకు లక్ష్మణ్, నరేష్ గౌడ్ హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌలికారి రాజు, దేవసాని రామ్ ప్రసాద్, వెంకటేష్ యాదవ్, రాకేష్, రామ గౌడ్, భూపతిరెడ్డి, శివరాజు, కిష్టయ్య, ఎల్లం తదితరులు పాల్గొని గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కొత్త ఇంటిలో ఆయురారోగ్యాలతో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు.

# కమ్యూనిస్ట్ పాలన కనుమరుగు

**- దేశంలో ముగిసిన వామపక్ష పాలన**

**- 49 ఏళ్ల తర్వాత ఏ రాష్ట్రంలో అధికారం లేని లెఫ్ట్ పార్టీలు**

**- కేరళలో ఎల్‌డీఎఫ్ ఓటమితో వామపక్షాలు కనుమరుగు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశంలో వామపక్షాల పాలనకు ముగింపు పలికినట్లయింది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన కొన్నేళ్ల తర్వాత కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో అక్కడక్కడా వామపక్ష పార్టీల ప్రాబల్యం ఉన్నప్పటికీ ఈ 3 రాష్ట్రాల్లో మాత్రమే సొంతంగా అధికారాన్ని ఏర్పాటు చేసిన చరిత్ర కలిగి ఉంది. అయితే పశ్చిమ బెంగాల్‌లో 2011లో మమతా బెనర్జీ ఎంట్రీతో లెఫ్ట్ పార్టీల పాలన కనుమరుగైంది. అప్పటి నుంచి వరుసగా 3 సార్లు బెంగాల్‌లో విజయం సాధించిన టీఎంసీ వామపక్షాల ఉనికి లేకుండా చేసింది. ఇక త్రిపురలో 2 దశాబ్దాల పాటు సాగిన వామపక్ష పాలనకు 2018లో తెరపడింది. ఇక కేరళలో గత 2 ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ విజయం సాధించగా తాజాగా ఓడిపోవడంతో వామపక్షాల ప్రాతినిధ్యం పూర్తిగా అంతమైంది.

### - కేరళలో సుదీర్ఘ కాలంగా వామపక్షాల పాలన

భారతదేశంలో మొట్టమొదటిసారి 1957లో వామపక్ష పార్టీ పాలన మొదలైంది. కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు మాత్రమే ఇప్పటివరకు వామపక్షాల పాలనను చూశాయి. ప్రపంచంలోనే తొలిసారిగా ప్రజాస్వామ్యబద్ధంగా కేరళలో లెఫ్ట్ పార్టీ విజయం సాధించింది. భూసంస్కరణలు, సామాజిక సంక్షేమ పథకాలు వంటి విప్లవాత్మక మార్పులను కేరళలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) ప్రవేశపెట్టింది. ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానానికి అప్పట్లోనే పునాదులు పడ్డాయి. అయితే కేరళలో ప్రతిపక్షాల ప్రతిఘటన కారణంగా 1959లో అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ ఆర్టికల్ 356ను ఉపయోగించి తొలిసారి వామపక్ష ప్రభుత్వాన్ని రద్దు చేశారు. ఇది దేశంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం తొలగించిన మొదటి ఉదాహరణగా నిలిచింది. పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ కూటమి 2016, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చి రికార్డు సృష్టించినప్పటికీ ప్రస్తుత ఎన్నికల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత, పినరయి విజయన్ ఒక్కడిపైనే ఎక్కువగా ఆధారపడటం ఎల్‌డీఎఫ్ కూటమి ఓటమికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

### - పశ్చిమ బెంగాల్‌లో కమ్యూనిస్టుల సుదీర్ఘ పాలన

జ్యోతి బసు, బుద్ధదేవ్ భట్టాచార్యల నాయకత్వంలో పశ్చిమ బెంగాల్‌లో 1977 నుంచి 2011 వరకు కమ్యూనిస్ట్ పార్టీ ఎలాంటి అడ్డంకులు లేకుండా పాలన సాగించింది. 1964లో సీపీఐ విడిపోయి సీపీఐ, సీపీఐ(ఎం)లుగా ఏర్పడిన తర్వాత ఆ పార్టీ రైతులు, కార్మికులను తన ఓటు బ్యాంకుగా మార్చుకుంది. అదే సమయంలో పంచాయితీ రాజ్ వ్యవస్థ ద్వారా అధికార వికేంద్రీకరణను సక్సెస్‌ఫుల్‌గా అమలు చేసింది. అయితే 1990లలో పారిశ్రామికీకరణ కోసం బలవంతంగా భూసేకరణ చేయడం వంటి నిర్ణయాలు సీపీఐకి గట్టి ఎదురుదెబ్బగా మారాయి. దీంతో చివరికి 2011లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చేతిలో లెఫ్ట్ పార్టీ ఓడిపోయి ఆ రాష్ట్రంలో తన ప్రస్థానాన్ని ముగించింది.

### - 2 దశాబ్దాల పాటు త్రిపురలో లెఫ్ట్ పార్టీల పాలన

త్రిపురలో మొదటిసారి 1977లో కమ్యూనిస్ట్ ప్రభుత్వం ఏర్పడింది. ముఖ్యంగా మాణిక్ సర్కార్ నాయకత్వంలో 1998 నుంచి 2018 వరకు దాదాపు రెండు దశాబ్దాల పాటు వామపక్ష పార్టీ ఆ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఆదివాసీ తెగల మధ్య కమ్యూనిస్ట్ పార్టీ చేసిన క్షేత్రస్థాయి కృషి వారికి బలమైన పునాదిని ఇచ్చింది. అయితే 2018లో త్రిపురలో కమ్యూనిస్ట్‌ల కంచుకోటను బీజేపీ బద్దలు కొట్టింది. జాతీయ స్థాయి అంశాలతో పాటు త్రిపురలోని స్థానిక సమస్యలైన ఉద్యోగుల జీతాల పెంపు, నిరుద్యోగం వంటి సమస్యలపై దృష్టి సారించి విజయం సాధించింది. ఇక ఆర్ఎస్ఎస్ మద్దతుతో త్రిపురలోని యూత్, మహిళలను ఆకర్షించడంలో కమలం పార్టీ సక్సెస్ అయింది.

**భారతదేశ రాజకీయాల్లో ఒకప్పుడు కీలక పాత్ర పోషించిన కమ్యూనిస్ట్ పార్టీలు తమకు పట్టు ఉన్న 3 రాష్ట్రాల్లో కూడా అధికారాన్ని కోల్పోవడమే కాకుండా, పార్టీ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో లెఫ్ట్ పార్టీల ఆనవాళ్లు కూడా కనిపించేలా లేవంటూ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.**

# ఒక్క మార్పుతో 'పవర్' కట్

**- అప్పుడు తెలంగాణ, ఇప్పుడు తమిళనాడు - బీజేపీ సింగిల్ క్లిక్‌తో అధికార పార్టీ ఔట్**




హైదరాబాద్ (ప్రశ్న అవషం) తమిళనాడులో డీఎంకే కూటమికి ఊహించని పరాభవం ఎదురైంది. డీఎంకే వరుసగా రెండోసారి అధికారంలో వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే డీఎంకే ఓడిపోయి ప్రతిపక్ష పాత్రకు పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతే కాదు కొళత్తూరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన సీఎం స్టాలిన్ టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో ఏకంగా 9 వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. పార్టీ ఓటమి కంటే స్టాలిన్ ఓడిపోవడాన్ని డీఎంకే శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న వేళ సోషల్ మీడియాలో ఓ పోస్టు ఆసక్తికరంగా మారింది. ఎన్నికలకు ముందు బీజేపీ తమ రాష్ట్ర అధ్యక్షుణ్ని మారిస్తే ఆ రాష్ట్రంలో అధికార మార్పు జరుగుతుందనేది ఈ పోస్టు సారాంశం. ఇంతకు ముందు తెలంగాణలో, ఇప్పుడు తమిళనాడులో ఇదే జరిగిందని చెబుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ లో బండి సంజయ్ సారథ్యంలోని బీజేపీ దూకుడు మీద ఉంది. కానీ ఎన్నికలకు ఆరు నెలల ముందు 2023 జులై 4న సంజయ్‌ను పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. బండిని తప్పించిన తర్వాత తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ వేగంగా పడిపోయింది. అప్పటి వరకూ బీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అన్నట్టుగా వ్యవహరించి రెండో స్థానంలో ఉన్నట్టు కనిపించిన కమలం పార్టీ వేగంగా కిందకు జారింది. దీంతో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితమైంది. తెలంగాణలో బండి సంజయ్‌ను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పించడం అప్పట్లో చాలా మందిని ఆశ్చర్యపరిచింది. తమిళనాడులోనూ ఇదే తరహాలో బీజేపీ వ్యవహరించింది. తమిళనాట బీజేపీ పుంజుకోవడానికి శక్తికి మించి శ్రమిస్తోన్న అన్నామలైను 2026 ఏప్రిల్‌లో పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. ఆయన స్థానంలో నైనార్ నాగేంద్రన్‌ను నూతన అధ్యక్షుడిగా నియమించింది. అన్నాడీఎంకేతో పొత్తు కోసమే అన్నామలైను అధ్యక్ష పదవి నుంచి తప్పించారని ప్రచారం జరిగింది. అన్నామలై విషయంలో పళనిస్వామి సౌకర్యంగా లేకపోవడం వల్లే ఈ మార్పు జరిగిందని చెబుతారు. దీనికి తగ్గట్టుగానే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీవీకే విజయం ఖాయమైన వేళ అన్నామలై వేసిన ట్వీట్‌లో పళనిస్వామి ప్రస్తావన తీసుకురాలేదు. ఐపీఎస్ అధికారి అయిన అన్నామలై ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. దూకుడుగా వ్యవహరిస్తూ తమిళనాడులో బీజేపీకి మంచి గుర్తింపు తీసుకొచ్చారు. అలాంటి నేతను ఎన్నికల ముందు అధ్యక్ష పదవి నుంచి తప్పించడం బీజేపీ శ్రేణులను సైతం ఆశ్చర్యపరిచింది. తీరా చూస్తే తమిళనాడులోనూ అధికార మార్పిడి జరిగింది. డీఎంకే కూటమి అనూహ్యంగా భంగపాటుకు గురైంది. డీఎంకే ఓటమికి, బీజేపీ అధ్యక్ష మార్పుకు సంబంధం ఉందని చెప్పలేం. కానీ ఎన్నికల ముంగిట తెలంగాణతోపాటు తమిళనాడులోనూ బీజేపీ అధ్యక్షుణ్ని మార్చడం అధికార పార్టీలు ఇంటి ముఖం పట్టడానికి కారణమైంది.

# రేషన్ బియ్యం మాఫియాపై ఉక్కు పాదం మోపుతున్న డీఎస్పీ వెంకటేశం

**నిత్యం దాడులతో క్వింటాళ్ల కొద్ది రేషన్ బియ్యం స్వాధీనం**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అక్రమ రేషన్ బియ్యం దందాపై కఠిన చర్యలు తీసుకుంటూ సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ టీమ్--2 డీఎస్పీ వెంకటేశం తనదైన శైలిలో దాడులు కొనసాగిస్తున్నారు. పేదలకు చెందాల్సిన ప్రభుత్వ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మాఫియాపై ఆయన కఠినంగా వ్యవహరిస్తూ వరుస విజయాలను నమోదు చేస్తున్నారు. తాజాగా హైవేపై భారీ లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకోవడం ద్వారా మరోసారి తన చురుకుదనాన్ని డీఎస్పీ వెంకటేశం నిరూపించారు.

విశ్వసనీయ సమాచారం మేరకు ముందస్తు ప్రణాళికతో నిఘా పెట్టిన డీఎస్పీ వెంకటేశం బృందం, అనుమానాస్పదంగా వెళ్తున్న లారీని అడ్డగించి తనిఖీ చేసింది. తనిఖీలో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం బయటపడటంతో వెంటనే లారీని స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు.

ఈ చర్యతో అక్రమ రవాణాకు పెద్ద దెబ్బ తగిలింది. ఇటీవల కూడా క్వింటాళ్ల కొద్దీ రేషన్ బియ్యాన్ని పట్టుకుని ప్రభుత్వానికి స్వాధీనం చేయించిన వెంకటేశం, మాఫియాపై ఉక్కుపాదం మోపుతూ కట్టడి చర్యలు తీసుకుంటున్నారు. ఆయన నాయకత్వంలో పనిచేస్తున్న టాస్క్ ఫోర్స్ బృందం పక్కా సమాచారంతో మెరుపు దాడులు నిర్వహిస్తూ మాఫియా కార్యకలాపాలను చిత్తు చేస్తోంది. దీంతో రేషన్ బియ్యం అక్రమ రవాణా దారులు భయంతో వెనక్కి తగ్గుతున్న పరిస్థితి నెలకొంది. "డీఎస్పీ వెంకటేశం పేరు వినగానే మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి" అని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆయన కఠిన వైఖరి, అవినీతి పట్ల అసహనం, విధి నిర్వహణలో నిబద్ధత మాఫియాకు చెక్ పెడుతున్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పేదలకు చేరాల్సిన ధాన్యం దోపిడీ కాకుండా కాపాడటంలో ఆయన తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం అని పలువురు అభినందిస్తున్నారు. ప్రభుత్వం కూడా ఇటువంటి అధికారులను ప్రోత్సహిస్తూ మరింత బలోపేతం చేస్తే అక్రమ రేషన్ దందాను దాదాపు పూర్తిగా నిర్మూలించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. పేదల హక్కులను కాపాడటంలో డీఎస్పీ వెంకటేశం చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. అక్రమ దందాలకు చెక్ పెట్టే ఇలాంటి దాడులు నిత్యం కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఓటమిపై స్పందించిన స్టాలిన్

**- ప్రజా తీర్పును గౌరవిస్తున్నామన్న డీఎంకే అధినేత**



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై డీఎంకే పార్టీ అధినేత ఎంకే స్టాలిన్ స్పందించారు. ఆయన ఓటమిని అంగీకరించారు. తమిళనాడు ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నానని అన్నారు. విజేతలకు ఆయన అభినందనలు తెలిపారు. డీఎంకే ఇక నుంచి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ, ప్రభావవంతమైన ప్రతిపక్షంగా పనిచేస్తుందని అన్నారు. గత ఐదేళ్ల తమ పాలనలో ప్రజల కోసం ఎన్నో ప్రాజెక్టులు చేపట్టామని, సుపరిపాలన అందించామని అన్నారు. ఇన్నాళ్లు సమర్థవంతంగా పాలన అందించామని, ఇక నుంచి నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు. తాము చేపట్టిన అభివృద్ధి పనులను చూపించి ప్రజలను ఓట్లు అడిగామని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ వాటిని కొనసాగిస్తామని హామీ కూడా ఇచ్చామని అన్నారు. కానీ తీర్పు తమకు అనుకూలంగా రాలేదని అన్నారు. తన రాజకీయ జీవితంలో అద్భుత విజయాలు చూశానని, అలాగే ఓటములను కూడా చూశానని పేర్కొన్నారు. ఇకముందు డీఎంకే రాజకీయ ప్రయాణం ఎలాంటి తడబాటు లేకుండా కొనసాగుతుందని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. డీఎంకే రెండో స్థానానికి పరిమితమైంది.

## భవానీపూర్‌లో మమతా బెనర్జీకి భారీ షాక్

**- సువేందు అధికారి చేతిలో ఓటమి**



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంచలనం నమోదైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తన సొంతగడ్డ భవానీపూర్ నియోజకవర్గంలో ఓటమి చవిచూశారు. బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో ఆమె పరాజయం పాలయ్యారు. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో ఎదురైన ఓటమికి ప్రతీకారంగా ఈసారి భవానీపూర్ నుంచి బరిలోకి దిగినా, ఫలితం మారకపోవడం గమనార్హం. ఎన్నికల సంఘం వెల్లడించిన ఫలితాల ప్రకారం, సువేందు అధికారికి 73,917 ఓట్లు రాగా, మమతా బెనర్జీకి 58,812 ఓట్లు మాత్రమే లభించాయి. దీంతో 15,105 ఓట్ల మెజారిటీతో సువేందు అధికారి ఘన విజయం సాధించారు. సువేందు చేతిలో మమత ఓడిపోవడం ఇది వరుసగా రెండోసారి. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో జరిగిన హోరాహోరీ పోరులోనూ సువేందు చేతిలోనే ఆమె ఓటమి పాలయ్యారు. మరోవైపు, సువేందు అధికారి ఈ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసి, రెండింటిలోనూ గెలుపొంది రికార్డు సృష్టించారు. భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్ నియోజకవర్గంలోనూ పోటీ చేయగా, నందిగ్రామ్ లో తృణమూల్ అభ్యర్థి పబిత్ర కర్ పై 9,665 ఓట్ల తేడాతో ఆయన విజయం సాధించారు. ముఖ్యమంత్రిపై వరుసగా రెండుసార్లు గెలవడం, రెండు నియోజకవర్గాల్లోనూ జయకేతనం ఎగురవేయడంతో సువేందు అధికారి బెంగాల్ రాజకీయాల్లో మరింత బలమైన నేతగా అవతరించారు. బెంగాల్ సీఎం రేసులో సువేందు అధికారి ముందున్నారు.

## విజయ్‌కి ఫోన్ చేసి అభినందనలు తెలియజేశా

**- రాహుల్ గాంధీ ట్వీట్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. టీవీకే పార్టీ అధినేత విజయ్‌తో మాట్లాడానని, పార్టీ సాధించిన అద్భుతమైన ఫలితానికి ఆయనను అభినందించానని పేర్కొన్నారు. ప్రస్తుతం యువగళం పెరుగుతోందనడానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని అన్నారు. తమిళనాడు, పుదుచ్చేరిలలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. తమిళనాడు, పుదుచ్చేరి ప్రజల కోసం పార్టీ పని చేస్తుందని హామీ ఇచ్చారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 100కు పైగా స్థానాల్లో విజయం సాధించింది. డీఎంకే 70కి పైగా, అన్నాడీఎంకే 50కి పైగా స్థానాలతో సరిపెట్టుకున్నాయి. పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాలలో బీజేపీ, మిత్రపక్షాలు విజయం సాధించాయి. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అధికారం చేజిక్కించుకుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588